
ఆణిముత్యాలు
1997
కస్తూరి బెహెన్


ఆణిముత్యాలు
1997

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

సిస్టర్ కస్తూరీగారి తెలుగు పుస్తకాల కొరకు


కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058** లేదా

**9063177540**


సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు

**- కస్తూరి బెహెన్**

సోదరి కస్తూరి అప్పుడప్పుడు అభ్యాసీలతో చెప్పిన విషయాలు, అభ్యాసీల ప్రశ్నలకు ఇచ్చిన జవాబులు, బాబూజీ ఆయా సందర్భాలలో ఇచ్చిన వివరణలూ ఈ చిన్న పొత్తంలో వివరించడం జరిగింది.

ఇందులోని తప్పొప్పులు
మీకు అందించిన - మావి
ఒప్పులన్నీ బాబూజీ
కృపా ధారలు

21-12-1997 -- మీ సోదర అభ్యాసీలు

# ఆణిముత్యాలు - 1997

కస్తూరి బెహెన్

**ప్రశ్న:** పునర్జన్మ రాహిత్యానికి, ముక్తికిగల భేదమేమిటి?

**జవాబు:** మనస్సు దివ్యం మీదనే లగ్నం కావాలి. సహజమార్గం మీద ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఇచ్చే బాబూజీ మీద విశ్వాసం ఉండాలి. మన దృష్టి పూర్తిగా అంతర్ ముఖమై దివ్యం మీదే లగ్నమైనప్పుడు మనం శారీరక (భౌతిక) స్పృహను కోల్పోతాము. ఇటువంటి స్థితికి చేరుకున్నప్పుడు ఆ స్థితిలో లయమైనప్పుడు పునర్జన్మ నుంచి విముక్తిని ప్రసాదించడమే బాబూజీ యొక్క అనుగ్రహం. ధ్యానమంతా హృదయం మీదే నిలిపి సాధన చేస్తూ ఉంటే స్థూలశరీరం అనగా భౌతిక శరీరం యొక్క ధ్యాస కనుమరుగై పోతూ బాబూజీతో మనకు అనుబంధం ఏర్పడుతుంది. ఇంకా సాధన చేసినకొలదీ ఆత్మ సూక్ష్మ శరీరం, కారణ శరీరం కూడా దాటే వరకు 'నేను' అనే భావం కొంత ఉంటుంది. అందుచేత ఈ స్థితిలో విముక్తి (లిబరేషన్) పొందినట్లు కాదు. ఆత్మ శారీరక బంధనాన్ని ఛేదించుకొని వెనుదిరిగి చూడకుండా ఎప్పుడైతే పరమాత్మ శక్తితో లీనమైపోతుందో అప్పుడు విముక్తి కలుగుతుంది. ఈ స్థితికి చేరిన ఆత్మయే విముక్తాత్మ (లిబరేటెడ్ సోల్) అవుతుంది. అప్పుడు మన ఆత్మకు అస్థిత్వం కూడా తెలియదు. అనగా బాబూజీ తో నేరుగా సంబంధము ఏర్పడి అభ్యాసి యొక్క అన్ని స్థితులను బాబూజీ తన ఆధీనంలో ఉంచుకుంటారు. అభ్యాసికి తన పురోగతిలో వచ్చే మార్పులు పైనుంచి వస్తున్నట్లుగా అనుభమవుతుంది.

"ఈశ్వరుని చేరటమే మానవుని పరమ లక్ష్యం. అందుకు ప్రయత్నించడమే ఆధ్యాత్మికతకు (స్పిరిట్యుయాలిటీకి) ప్రారంభదశ. ఈ సాధనలో తనను తాను మర్చిపోవడం మొదటి మెట్టు. ఇలా

మరచిపోగల గడమనే దశే ఆధ్యాత్మికత ప్రారంభ మైనదనటానికి నిదర్శనం. మతం అనే దానికి ముగింపు ఎక్కడో అక్కడ ఆధ్యాత్మికత ఆరంభమవుతుంది. ఎప్పడు ఆత్మ తన బంధనాలను విడనాడి పరమాత్మ శక్తితో లీన మవుతుందో అప్పడు ఆధ్యాత్మికత అంతమై రియాలిటీ ప్రారంభమవుతుంది. ఆత్మ పరమాత్మతో లయం కాకముందు అందరిలోనూ భగవంతుడు పరివ్యాప్తమై ఉన్నట్లు ఆత్మలన్నీ భగవంతునిలో లీనమవుతున్నట్లు అనుభవమవుతుంది. ఈ స్థితిలో రియాలిటీ ఆఖరైపోయి, ఆత్మల సమ్మేళనం కూడ మరచిపోయి పరమాత్మ ఒక్కటే, - తానేపరమాత్మ-అను అనుభూతి కలిగి మహోజ్వలానందం కలుగుతుంది" అని బాబూజీ అనేవారు.

బాబూజీతో అభ్యాసి ఒకరు తాను 'రామ' 'రామ' అని జపిస్తూ ఉంటానని చెప్పినప్పడు - వారు అతడు జపించే 'రామ' శబ్దం యెక్క అర్థం ఏమిటని ప్రశ్నించి 'అలా పేరుతో పిలుస్తూ వుంటే, దగ్గరలో ఉంటే వస్తాడు. కాని దూరంగా ఉంటేనో?' అని తిరిగి దాని అర్థం వివరిస్తూ బాబూజీ "రామ అంటే రామ అవుతుంది. కాని అదే 'మ' తో ప్రారంభమైతే, 'రా' తో కలసి 'మరా' అవుతుంది. అంటే 'చచ్చాను' అన్నట్లు అవుతుంది." అన్నారు.

సర్వదా ధ్యానమే మనల్ని గమ్యానికి చేర్చుతుంది. రైలు ప్రయాణంలో మనం మేల్కొని ఉన్నా, నిద్రలో ఉన్నా గమ్యానికి చేరినట్లే - సహజ మార్గంలో ప్రయాణం (సాధన) మనల్ని గమ్యమైన అనంతానికి చేర్చుతుంది. మనం ఏ దారిన వచ్చామో ఆ దారినే వెతుక్కుంటూ వెళ్తే మళ్ళీ మన స్వస్థానానికి వెళతాము. అదే సహజమార్గం. దీని మహత్తును వర్ణించడం అసాధ్యం. అనిర్వచనీయం. బాబూజీ అనంతం నుండి అవతరించారు. కనుక మనల్ని భగవత్ సాక్షాత్కార స్థితి నుంచి కూడా పైకి తీసుకొని వెళతారు.

భవబంధం ఉండి పరమాత్మలో పూర్తిగా లయమైపోనంత వరకు వేర్వేరు ఆత్మలు - పరమాత్మ, అనే వైవిధ్యం ఉంటుంది. పూర్తిగా లయమైపోయిన తర్వాత ఈ భేద భావం పోయి అంతా ఒక్కటే అనే అనుభూతి కలుగుతుంది.

దైవ దర్శనం (రెవెలేషన్) పొందుతున్నట్లు ఎలా గుర్తించడం - అన్న ప్రశ్నకు సమాధానంగా సోదరి కస్తూరి ఇలా అన్నారు.

మనం ధ్యానంలో కూర్చున్నప్పుడు మన దృష్టి హృదయం మీద కేంద్రీకరిస్తాము. తర్వాత హృదయం పూర్తిగా తెరవబడినట్లు అవుతుంది. ధ్యానం అప్పడు ఆంతరంగికంగానూ బాహ్యంగానూ కూడా ఒక్కటిగానే ఉండి సర్వత్రా వ్యాపించినట్లు అవుతుంది. ఆత్మ దానంతటదే పురోగతి చెందుతూ ఉంటుంది.

**ప్రశ్న:** సహజ మార్గ పద్ధతికి ఇతర సాధనా పద్ధతులకు గల తేడా ఏమిటి?

**జవాబు:** సహజ మార్గంలో బాబూజీ అభ్యాసికి ట్రాన్స్మిషన్ ఇస్తారు. సాధనలో మార్గదర్శకత్వం వహించి అభ్యాసి ఎదిగిన స్థాయి నుండి దిగజారిపోకుండా కాపాడుతారు. భక్తితో, దీక్షతో సాధన చేసిన వారినందరినీ బాబూజీ పైకి తీసికెళతారు.

ఇతర సాధనా పద్ధతుల్లో అభ్యాసి ప్రాణాహుతి ప్రసారం (ట్రాన్స్మిషన్) పొందే అవకాశం లేదు. తన కండిషన్ (స్థాయి) తెలియదు. అతని స్థాయిని, పురోగతిని తెలియచెప్పే వారు ఉ ండరు. సహాయం చేసేవారూ ఉండరు. కొందరు స్వయం సాధనతో పురోగతిని సాధించినా దిగజారిపోవచ్చు.

**ప్రశ్న:** సహజ మార్గ సాధకులకు, ఇతర సాధకులకు భగవత్ సాక్షాత్కారం పొందగోరువారికి బాబూజీ చేసే సహాయంలో భేదం ఉంటుందా?

**జవాబు:** చాలా భేదం ఉంది. ఇతర సాధనా మార్గాలలో కబీరు, మీరాబాయి వంటి సాధకులు తమకు తామే అంచెలంచెలుగా ఎదిగారు. ఆ సాధకులు వారికి వారే మార్గాన్ని వెదుక్కోవాలి. మార్గంలో అవరోధాలు వారే తొలగించుకోవాలి. ఇతరుల సహాయం ఉండదు. దివ్యశక్తిని ప్రసాదించే వారుండరు. అయినా బాబూజీ వారికి కూడా సహాయం చేస్తారు. కాని వారిలో భగవత్ సాక్షాత్కారం కోసం తపన, ఆర్తి ఉండాలి. సహాయం కొరకు విన్నపం చేసుకోవాలి. దీక్షతో సాధన చేయాలి. సాధకుడు కోరిన కోరిక మేరకు అనుగ్రహించితే అతనికి ఆనందం కలుగుతుంది.

ముక్తి సాధనలో ముందుకు సాగిపోవాలంటే సహజ మార్గం అందుకు సాటిలేనిది.ఈ మార్గంలో బాబూజీ ముందుగానే ముళ్లను ఏరివేసి బాటను మృధువుగా చేశారు. సహజ మార్గం మనం ఎంపిక చేసుకున్న మనోహరమైన పుష్పం వంటిది. పూవు నుంచి సువాసన ఎలా వెదజల్లబడుతుందో సహజ మార్గం నుంచి దివ్యశక్తి అలా ప్రవహిస్తూ ఉంటుంది. భగవంతుని దివ్య సన్నిధిని చేరాలనే తపన, సాధన మినహా వేరే విధానం అంటూ లేదు.

సహజ 'మార్గం'లో ముళ్ళు తొలగించబడిన మనోహరమైన గులాబీ పుష్పాలు మాత్రమే ఉన్నాయి. అభ్యాసి దీనిని స్వీకరించటంలో ఏ ఇబ్బంది కలుగదు. ఈ విధానం అన్నీ మంచి వాటితోనే నిండి ఉంది. బాబూజీ ఆశీస్సులతో మీరు అంతిమానికి చేరవచ్చు. అభ్యాసికి సాధనా మార్గంలో ఎదురయ్యే ఆటంకాలన్నీ తొలగించబడతాయి. ఇతర సాధనా పద్ధతుల్లో కూడా మంచి ఉండవచ్చు. కాని ఆ పద్ధతులు సులభతరముగ సమస్యా రాహిత్యముగా తీర్చబడలేదు. సహజ మార్గం యొక్క సాటిలేని సౌందర్యమిదే!

సోదరి కస్తూరిగారు ఇలా అన్నారు.

"నేను దివ్యప్రేమ పిచ్చిదానను. 'వారి'తో మాట్లాడాలని అనిపిస్తుంది. 'వారి'నే చూడాలని అనిపిస్తూంది. అందుకే నాకు ఎక్కడ చూసినా బాబూజీయే కనిపిస్తారు.- అలా ఉంటేనే మనకు 'వారి'తో దివ్య సంబంధం ఏర్పడుతుంది."

**ప్రశ్న:** అభ్యాసి భయ సందేహాల నుండి నివృత్తి పొందాలని ఆశించడమెలా?

**జవాబు:** భయ సందేహాలు ఎలా ఉన్నాయో - సహజ మార్గంలో భయ రాహిత్యము, సందేహ రాహిత్యము రెండూ ఉన్నాయి.

సహజ మార్గంలో ఆధ్యాత్మికత (స్పిరిట్యుయాలిటి)లో ప్రవేశించగానే సందేహం ప్రారంభమవుతుంది, మనం గమ్యం చేరగలమా లేదా అని. దానిలో మనం పొందే అనుభవాలు ఒక్కొక్కసారి ఒక్కో విధంగా ఉంటాయి. ఈ అనుభవాలలో ఉన్న హెచ్చు తగ్గులు, మార్పులు సందేహానికి గురిచేస్తుంటాయి. కొన్ని దశలలో ధ్యానం ప్రారంభిస్తూనే సందేహం వస్తుంది. కొంచెంసేపు నిశ్చలంగా కూర్చుంటే వాటిని మర్చిపోతాము.

బాబూజీ చెప్పేవారు-సందేహం చాలా విషపూరితమైనదని. సహజ మార్గం సందేహాలకు ఆస్కారంలేని సిస్టమ్. కాని సందేహాలు కొన్ని స్టేజస్‌లో ఉంటాయి. మనస్ఫూర్తిగా ధ్యానంచేస్తే ఇవి తొలగిపోతాయి. సందేహం ఊహాజనితం. ఈ ప్రపంచంలోని విషయాలలో నిమగ్నమై సందేహాలలో నివసించి మీరు స్వయంగా అనుమాన మనస్కులైపోయారు. మనలో 'నేను' ఉన్నంత వరకు సందేహం ఉంటుంది. 'నేను' (అస్థిత్వంలో) 'సందేహం' సంసిద్ధంగా (ఎలర్ట్) ఉంటుంది. నేను (అస్థిత్వం) మర్చిపోతే సందేహమూ

తొలగిపోతుంది. బాబూజీతో అనుబంధం పెంచుకుంటే 'నేను' క్రమేణా తొలగిపోయి సందేహాలు సమసిపోతాయి.

**భయం రెండు రకాలు.**

**మొదటిది:** భౌతిక జీవితానికి సంబంధించినది. దీనిని ప్రార్థన ద్వారా తొలగించుకోవచ్చు.

**రెండవది:** ఆధ్యాత్మికత గురించి. అనగా మన గమ్యాన్ని చేరగలమా లేదా అని.

అభ్యాసి కృత నిశ్చయంతో మిషన్‌లో చేరి బాబూజీ చెప్పిన విధంగా సాధన చేస్తే పురోగతితో గమ్యం చేరతాడు. బాబూజీతో సాన్నిహిత్యం పెంచుకున్న కొలదీ సందేహంకూడా క్రమంగా కనుమరుగైపోతుంది. బాబూజీ ఒకసారి 'సందేహానికి కూడా తాను ఉన్నానా లేదా అని సందేహం కలుగుతుంది' అని చమత్కరించారు.

**ప్రశ్న:** అభ్యాసి వివిధ దశల గుండా ప్రయాణించేటపుడు సాధనలో కలిగిన అనుభవాలు ప్రతి దశలోను (పునరావృతం) మళ్ళీ అనుభవం అవుతాయా?

**జవాబు:** సాధనలోని అనుభవాలు మళ్ళీ వస్తాయి. కాని ఒకే సాంద్రతలో ఉండవు. ఒక్కొక్కసారి స్వల్పంగాను, మరొకసారి ఘనంగాను ఉంటాయి. ఒక సంవత్సరం మెడిటేషన్‌లో అనుభవమైన లైట్‌నెస్ (తేలికదనము) మరో సంవత్సరంలో కల్గిన అనుభవం కంటే హెచ్చుగానో, తక్కువగానో ఉండవచ్చు. అనుభూతి ఒక్కటే అయినా అంశ (డిగ్రీ)లో తేడా ఉంటుంది. ధ్యానం చేస్తున్నప్పుడు మనకు కల్గిన అనుభూతులు ఆనందపరుస్తాయి. అలాగే మళ్ళీ ధ్యానంలో కూడా ఆనందం కలుగుతుంది. కాని వీటిలో భేదం ఉంటుంది. ఒకసారి మనం ప్రోగ్రెస్‌తో పై దశలకు పోతూ ఉంటే

అదనంగా వచ్చే ట్రాన్స్‌మిషన్, అనుభూతుల వలన కలిగే ఆనందం ఒక్కటైపోతే, మరోసారి, మనకు ఆలోచనలు వచ్చి ఆటంక పరచలేవు - అనే సంతృప్తి వలన కలిగే ఆనందం ఒకటి. కాని భావనలో తారతమ్యం ఉంది. ప్రతి దశలోనూ మనం అంతర్ముఖులమై చూసుకుంటే మనం కోరుకున్న ఆనందం అక్కడే ఉంటుంది. ఒక్కొక్కసారి శరీరం తేలికగా అనిపించవచ్చు. మరొకసారి గాలిలో తేలిపోతున్నట్లు అనిపించవచ్చు. రెండింటిలోను భావన ఒక్కటే. కాని (డిగ్రీ) అంశలో తేడా ఉంది. ఫోర్స్‌లో కూడా తేడా ఉంది.

ప్రోగ్రెస్ అంటే మీరు బాబూజీతో మరింత సన్నిహిత సంబంధం పొందుతున్నట్లు.అది ఇంకా దృఢమైన కొద్దీ 'నేను' అంటే అహం కరిగి ఆనందానుభూతి దానంతట అదే పెరుగుతుంది.

బాబూజీతో ఒక అభ్యాసి తనకు లైట్‌నెస్ రావటం లేదన్నాడు. బాబూజీ మంచిదే అన్నారు. మరికొందరు తమకు లైట్‌నెస్ బాగా వస్తుందనగా అదీ మంచిదే అన్నారు. అదీ ఇదీ రెండూ ఎలా మంచివి అవుతాయి అని అన్నాడు ఒక అభ్యాసి. అప్పుడు బాబూజీ ఇలా చెప్పారు. ఒక గాడిద ఉంది. దాని మీద ఎంత బరువు వేసినా మోసుకొని పోతుంది. కాని బరువు దించేటపుడు వీపు మీది బరువు తగ్గించిన చికాకుతో చిందులు తొక్కుతుంది. అంటే ఈ గాడిదకు బరువే ఇష్టం అన్నమాట.

'తేలిక' అనే భావం నెమరువేసుకుంటే అదే ధ్యాస ఉంటుంది. కాని తపనతో సాక్షాత్కారం కొఱకు ధ్యానం కొనసాగిస్తే అదే లభ్యమవుతుంది.

**ప్రశ్న:** సత్సంగ్‌లో నిద్ర పోతున్నట్లు ఎందుకుంటుంది?

**జవాబు:** ఈ నిద్ర రెండు రకాలుగా ఉంటుంది. మొదటి దానిలో అభ్యాసి ధ్యానంలో ఉండగా దివ్యశక్తిని గ్రహిస్తూ కొన్ని అనుభూతులు

పొందుతూ ఉంటాడు. ధ్యానంలో మునిగిపోయి తనను తాను మరచిపోయినందువల్ల భౌతిక స్పృహ ఉండదు. తాను ఎక్కడ ఉన్నదీ కూడా తెలియని పరిస్థితిలో ఉంటాడు. రెండవ రకమైన నిద్రలో అభ్యాసిశారీరక నిద్రను అనుభవిస్తాడు. దివ్యానుభవాలు అతని అవగాహనకు రావు. ఈ స్థితిమంచిది కాదు. అభ్యాసికి కొంత కాలానికి ఇది మత్తుగా అయి అలవాటుగా మారిపోతుంది. ఈ పరిస్థితి నుండి బయట పడటానికి కొంత క్లీనింగ్ అవసరం. అంతే కాకుండా అభ్యాసి ధ్యానం ప్రారంభించబోయే ముందు తాను మెడిటేషన్ చేయబోతున్నట్లుగా భావన చేసుకోవాలి. మధ్య మధ్య స్పృహ వచ్చినప్పుడు తాను మెడిటేషన్‌లో కూర్చున్నట్లుగా గుర్తు చేసుకొని మళ్ళీ ధ్యానం చేయటానికి ఉపక్రమించాలి.

ఒక్కో అభ్యాసి ధ్యానంలో గురక పెడ్తారు. అది మంచిది కాదు. అటువంటి సందర్భాలలో ప్రక్కనున్న వారు అతణ్ణి తట్టి ఆ స్థితి నుంచి మేల్కొల్పాలి.

**ప్రశ్న:** అభ్యాసి ధ్యానంలో ఉండగా కాంతి ఫోకస్ అవుతున్నట్లుగా అనుభవమైతే ఏమి చేయాలి?

**జవాబు:** త్రికుటి మధ్య భాగంలో దృష్టి నిలిపి ధ్యానం చేయటం వలన ఇలాంటి అనుభవం కల్గుతుంది. అలా అభ్యాసం చేయమని బోధించే వారికి కూడా దాని ఫలితం తెలియక పోవటమే కాక దాని వలన కలిగే ముప్పను తొలగించటం కూడా తెలియదు. సహజ మార్గ పద్ధతిలో కూడా త్రికుటిలో ఉన్న ఆ కేంద్రం తెరవబడే అవకాశం ఉన్నప్పటికీ బాబూజీ మహరాజ్ దాని ప్రమాదం నుంచి అభ్యాసీని కాపాడుతారు. దీని నివారణకు క్లీనింగ్ అవసరం. అలాంటి పరిస్థితి కలిగినప్పడు ఆ కేంద్రంలో బాబూజీ ఉన్నారని భావించుకుంటే ప్రమాదం తొలగిపోతుంది.

సంత్ కబీరు తన స్వానుభవాన్ని ఒక గీతంలో ఇలా వివరించాడు. స్వానుభవం లేకుండా ఒకడు వ్రాసిన దానిని చదివి, మరొకరు వ్రాసిన పుస్తకాలు చదవటం వలన అభ్యాసీల మనస్సుల్లో సందేహాలు రేకెత్తుతాయి. కాని తాను (కబీరు) మాత్రం భగవత్ సాక్షాత్కారం కోసం చేసే సాధనలో పొందిన స్వానుభవాలను మాత్రమే వల్లిస్తున్నానన్నాడు. మానవుడు ప్రాపంచిక విషయ సంకీర్ణమైన భవసాగరాన్ని దాటటమే ముక్తికి మార్గమన్నాడు. పల్లెవాడు పడవ మీద నదిని దాటించినట్లే సద్గురువు సాధకునికి సుగమమైన మార్గం బోధించి భవసాగరాన్ని దాటించి గమ్యానికి చేర్చుతాడు. 'నేను' అనగా అహం మరచి ధ్యానం ద్వారా సాధన చేస్తే దివ్యశక్తి నుంచి నిర్మల ధార సమకూరుతుంది.

**ప్రశ్న:** దివ్యత్వానికి, అంతిమానికి గల వ్యత్యాసం ఏమిటి?

**జవాబు:** దివ్యత్వంలో మన ఆత్మ వ్యక్తిత్వం అప్పడప్పడు స్ఫురిస్తూ ఉంటుంది. అంతిమంలో అది ఉండదు. (ఆత్మగత విచారం ఉండదు.) అంతా ఒక్కటే అవుతుంది.

**ప్రశ్న:** హృదయానికి, మనస్సుకు గల తేడా ఏమిటి?

**జవాబు:** మనస్సు ఆలోచిస్తుంది. హృదయం గ్రహిస్తుంది.

**ప్రశ్న:** నిద్రకు, యోగ నిద్రకు గల భేదమేమిటి?

**జవాబు:** బాబూజీ ఒకప్పడు ఇలా వ్రాశారు. యోగనిద్రలో మనకు స్పృహ ఉండదు. యోగనిద్ర నుంచి మేల్కొన్నప్పడు తాను ఎక్కడ నుంచో ఊడిపడినట్లుగా అనుభవమవుతుంది. ఒక విధమైన శారీరక కంపన ఉంటుంది. అంటే సుషుప్తావస్థలో అంతిమాన్ని దర్శించే దశలో విస్మృతి (ఎరుకలేక పోవటం) జరుగుతుంది.

నిద్రలో మేను (శరీరం) మరచినా ఆధ్యాత్మికానుభూతి

ఉండదు. శారీరకంగా విశ్రాంతి లభించినట్లు మాత్రమే అనుభవమవుతుంది.

**ప్రశ్న:** సహజ మార్గ విధానంలో మనస్సు యొక్క పాత్ర ఏమిటి?

**జవాబు:** నిరంతర దైవ స్మరణలో మనస్సులో మెదిలిన ఆలోచనలను హృదయము అనుభవించి పదిలపర్చుకుంటుంది. క్రొత్త అనుభూతులు వచ్చినా స్వీకరిస్తుంది. కాని పాత వాటిని విస్మరించదు. ఈ స్మృతి, నిక్షిప్తతల వల్లనే మనం గత విషయాలను నెమరు వేసుకుంటాం. ఉదాహరణకు ఒక విషయమై ఉదయం ఇలా జరిగింది. సాయంత్రం ఇలా జరిగింది, అని నెమరు వేసుకొనేటపుడు మరో విషయం అడ్డురాదు.

మనస్సు విషయంలో - దానిలో ఒక ఆలోచన జరుగుతున్నపుడు మరో ఆలోచన రాగానే పాతదానిని వదిలివేయటం జరుగుతుంది.

కస్తూరిగారు అభ్యాసీలను ఇలా ప్రశ్నించారు.

లక్నో నుండి తిరిగి వెళ్లిన తరువాత మీకు కల్గిన అనుభూతి ఏమిటి? - అని ప్రశ్నిస్తే ఏమి సమాధానం చెప్తారు?

అభ్యాసీలు ఏమీ చెప్పకపోయేసరికి ఆమె ఇలా అన్నారు.

ఒకసారి బాబూజీ నన్ను ఏమి పొందావు నీవు, అని అడిగినపుడు నేనేమీ పొందలేదు. కాని నన్ను 'నేను' పోగొట్టు కున్నాను, అని చెప్పాను. 'నేను' అంటే 'అహం'ను బాబూజీ పవిత్ర పాదాల వద్దనే ఉంచాలి. ఆయన పాదాక్రాంతులం కావాలి. దైవానుభవం కోసం తపన ఉండాలి. నిరంతర స్మరణ, సాధన చేయాలి. మన ఆత్మనుపరిశుద్ధంగా ఉంచటానికి మన ఇంటి పనుల్లో, మాటల్లో, ప్రవర్తనలో, ఇతరులతో వ్యవహరించటంలో

మృదుత్వం, పవిత్రభావాలు అలవరచుకోవాలి. ఇతరుల గుణదోషాలు వల్లించటం, ఇతరులను నిరసించటం, హేళన చేయటం సబబు కాదు. ఆధ్యాత్మిక ప్రగతికి సత్ప్రవర్తన చాలా అవసరం. బాబూజీ ఎవరినీ కోపగించేవారు కాదు. పిల్లలను బుజ్జగించి వారికి కావలసినవి సమకూర్చేవారే కాని కోపగించేవారు కాదు. వారిది చాలా సున్నితమైన హృదయం, ఆయనకు ఎప్పుడు ఏది అవసరమో తెలుసు. స్వల్ప విషయాల్లో కూడా ఆయనకు గమనం (దృష్టి) ఉండేది. అభ్యాసీలతో కాలం గడుపుతున్న సందర్భంలో కూడా వంట ఇంటిలో భోజన సదుపాయాలకు కావలసిన పిండి వగైరాలు సమకూరాయా లేదా అని గమనిస్తూనే ఉండేవారు. వారికే మనం అంకితమైతే అన్ని సమకూరుతాయి. మనం మన ప్రవర్తనను సత్ప్రవర్తనగా మార్చుకోవాలి. మాస్టర్ చెప్పిన దశ నియమాలు అనుసరించాలి. నిరంతర దైవ స్మరణ గల్గి సదాచారంతో వ్యవహరిస్తూ సాధన చేస్తే దశ నియామాలు (టెన్ కమాండ్‌మెంట్స్) వాటంతట అవే మనల్ని అనుసరిస్తాయి. దైవ స్మరణకు ఉదయాస్తమయాలు, దివారాత్రులు అనే సమయ నియమం లేదు.

దైవ సాక్షాత్కారం పొందాలనే తపనతో సాధన చేస్తే శరీరము మనస్సు నియంత్రించ బడతాయి. తపనతో వ్యధ చెందినప్పడు బాబూజీ మనకు సన్నిహితులవుతారు. మనలో ప్రవేశిస్తారు. ఉదాహరణగా చెప్పాలంటే మీరు ప్రతి రోజూ భోజనం చేస్తూ ఉంటారు. కాని ఒక రోజు ఉపవాసం చేయాలనుకుంటారు. ఆహారం శరీరానికి మాత్రమే అవుసరం కనుక, మనస్సు దానిని నిరోధిస్తూ ఉంటుంది. అలా ఉపవాసం ఉండాలని నిర్ణయించు కున్నప్పడు మీరు ఆహారం గురించి ఆలోచించరు. అలాగే మనల్ని మనం మరచిపోయి మాస్టర్‌లో లీనమైపోవాలి - అలా అనుకోవటం కూడా (దృఢ నిర్ణయం) అలాంటిదే.

సహజ మార్గంలో బాబూజీ మీద గాని, చారీజీ మీద గాని మరెవరి మీదనైనా గాని ధ్యానం చేయాలనే సిద్ధాంతం లేదు. కేవలం దైవం మీదే చేయాలి.బాబూజీ కూడా తన మీద ధ్యానం చేయవద్దని వారించారు. దివ్య జ్యోతి మీదే చేయమన్నారు. అంతే గాని భౌతికం అంటే స్థూల రూపంమీద చేయవద్దన్నారు. ఇందులో ఒక కీలకం ఉంది. బాబూజీతో మనం అనుసంధానమైనప్పడు ఆయన మనకు ఏమి ఇస్తున్నదీ (ఆ కిటుకు) తెలియదు. దైవమొక్కటే. మనం దానితోనే అనుసంధానం కావాలని చెప్పారు.

మన మిషన్‌కు సంస్థాపక అధ్యక్షులు బాబూజీ మహరాజ్. ఉదాహరణకు 'రామకృష్ణ మిషన్, బౌద్ధమతం తీసుకుందాము. వాటి మూలపురుషులు రామకృష్ణ పరమ హంస, బుద్ధుడు. ఇప్పటికీ వాటిని రామకృష్ణ పరమహంస, బుద్ధుడు వీరి పేరిటే వ్యవహరిస్తున్నాము. కాని వారి శిష్యులు వివేకనంద తదితరుల పేర్లతో కాదుకదా!

బాబూజీ మనల్ని ఉద్ధరించి ముక్తి ప్రసాదించడానికి భూమా (అంతిమం) నుండి అవతరించిన దివ్య పురుషులు. దివ్య శక్తి తన ఆధీనంలో కలిగినవారు బాబూజీ. జన్మ జన్మల పరంపరలో శరీరం మారుతుంది. కాని ఆత్మ ఒక్కటే. మన భౌతిక శరీరంలో దుస్తులు మార్చినట్లే ఆత్మ శరీరధారణ మారుస్తుంది. ఎప్పటికైనా మనకు మాస్టర్ ఒక్కరే!

**ప్రశ్న:** భూమా నుండి అవతిరించిన బాబూజీ పతంజలి అయ్యే అవకాశం ఉందా? బాబూజీ ఆత్మ కథలో పతంజలి గురించి వ్రాసిన విషయం వివరించండి.

**జవాబు:** లాలాజీ సాహెబ్ యొక్క దివ్య సంకల్పంతో బాబూజీ భూమా నుండి అవతరించిన దివ్యపురుషుడు. కనుక ఆయన మరొకరు అయి ఉండే ప్రశ్నే లేదు. బాబూజీ పతంజలి ఉనికిని గూర్చి లాలాజీని

అడిగినపుడు 'అందరూ నీలోనే ఉన్నారు. కనుక వెదకు అన్నారు. నీవెవరో నీకు తెలియడం లేదు. నీకు నకలుని తయారు చేయలేము' అని అన్నారు. అంటే బాబూజీ మానవాతీతుడు. అనంత శక్తి స్వరూపులు.

బాబూజీ పుస్తకాలు స్వయంగా వారి చేతితో వ్రాయలేదు. వారు చెబుతూ ఉంటే అనుయాయులు వ్రాస్తూండేవారు. వ్రాసేటపుడు మధ్యలో ఎవరైనా అన్య విషయాలు ప్రస్తావించి ఆటంక పరచేవారు. అపుడు వారు చెప్పే సమాధానాలు బాబూజీ చెప్పచున్న ఆత్మకథకు సంబంధించినవే అనుకుని లేఖకులు అదే వరసలో వ్రాయడం వలన - ఇలాంటి దోషాలు దొర్లినాయి. వీటిని బాబూజీ దృష్టికి తీసుకొని వెళ్ళాను. అందుచేత ఎవరైనా ఏదైనా వ్రాసేటప్పడు స్వయంగా అనుభవించిన దానిని, తెలిసిన దానినే నిర్దుష్టంగా వ్రాయాలి. అటువంటి వ్రాతలు ఇతరులకు కూడా ఉపయోగకరంగా ఉండాలి.

**ప్రశ్న:** ధ్యానంలో శ్వాసక్రియ నిలిచిపోయిందనే భావం ఏమి సూచిస్తుంది?

**జవాబు:** సరైన పద్ధతిలో సాధన చేస్తూ ఎవరైతే ధ్యానంలో నిమగ్నమై తనను తాను మరచి అంతర్లీన మవుతారో వారికి శ్వాసక్రియ అనుభవం కాదు. ఆ సమయంలో నేను ఉబ్బసం మూలంగా శ్వాసక్రియతో ఇబ్బంది ననుభవిస్తున్నప్పటికీ మెడిటేషన్‌లో నాకు ఆ ఇబ్బంది గ్రహింపుకు రాదు. ధ్యానంలో నిమగ్నత, సాంద్రత అందుకు కారణం. అలా కాకుండా మన దృష్టి శ్వాసక్రియ మీదకు మరలినపుడు మనకు దాని ఉనికి తెలుస్తుంది.

**ప్రశ్న:** యోగి తన పరిమిత జీవిత కాలం కంటే ఎక్కువ కాలం జీవిస్తాడు? అలా ఎందుకు జరుగుతుంది?

**జవాబు:** యోగికి తన ధ్యాన సమయంలో సహజ సిద్ధంగా జరిగే శ్వాస ప్రక్రియలోని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు (పూరక రేచకాలు) కొన్ని ఆగిపోతాయి. అతడు అలా వినియోగించకుండా మిగిలిపోయిన శ్వాస ఘడియలు రిజర్వులో ఉండిపోతాయి. ప్రతిజీవికి జనన మరణాలకు మధ్య కొన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఒక సంఖ్యకు పరిమితమై ఉంటాయి. ఆ సంఖ్య పూర్తి కాగానే జీవిత కాలం ముగిసి మరణం జరుగుతుంది. అందుచేత యోగి జీవితంలో రిజర్వులో ఉన్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల వినియోగ ఫలితంగా అతని జీవితకాలం పొడిగించబడుతుంది.

బాబూజీ ఒకసారి తాను లాలాజీ సాహెబ్ శ్వాసతో జీవిస్తున్నానని చెప్పారు. బాబూజీ భౌతికంగా జీవిస్తున్నా ఆయనకు ఆ ధ్యాస లేదు. ఎందుకంటే ఆయన లాలాజీలో లయమైపోయారు కనుక. ఆ విధంగా లయావస్థలో ఉన్నప్పుడు శ్వాస జరుగుతున్నదా లేదా అన్న అవగాహన రాదు. అదే జీవన్ముక్తి. శరీరం నామమాత్రమే. అభ్యాసి అంతిమంలో లయమైనప్పుడు భౌతికం భూమి మీద నడయాడుతున్నా దాని యొక్క స్పృహ ఉండదు. ఈ స్థితిలోనే బాబూజీ మహరాజ్ (లివింగ్ డెడ్) జీవిస్తూ మరణించటం అన్నారు. అతనికి తన జీవన స్మృతి ఉండదు. శరీరం యాంత్రికంగా పని చేస్తుంది.

**ప్రశ్న:** ధ్యానంలో ఉండగా బాహ్యంలోని శబ్దాలను గుర్తించటం, మళ్ళీ ధ్యానంలో నిమగ్నం కావటం ఎలా సంభవం?

**జవాబు:** ధ్యానంలో బాగా లోతుగా అంతర్ముఖమై ఉంటే బాహ్యంలోని శబ్దాలు మనకువిన్పించవు. ధ్యానంలో ఉండగా వచ్చే ఆలోచనలను మనం నిర్లక్ష్యం చేస్తే అవి ఎలా తొలగిపోతాయో - మన దృష్టి బాగా ఆంతరికమై ఉన్నప్పుడు బాహ్యధ్వనులు అలా మనకు వినిపించవు. కలవరపరచవు. కనీసం స్వంత శరీరంలోని ధ్వనులు

కూడా వినిపించవు. ధ్యానం మీద మన దృష్టి కేంద్రీకరణ కానపుడు అవి వినిపిస్తాయి.

ఒక అభ్యాసి బాబూజీకి ఇలా ఫిర్యాదు చేశాడు. మీరు సిట్టింగ్ ఇస్తున్నప్పుడు నేను కూడా సిట్టింగ్‌లో కూర్చున్నాను. మీ వెనుక ఇద్దరు వ్యక్తులు-నేను చెడ్డవాడినని అయినా అర్హత లేకుండా సిట్టింగ్‌లో పాల్గొంటున్నాడెందుకు, అని చర్చించుకుంటున్నట్లు విన్పించింది నాకు.

బాబూజీ అప్పుడు అతణ్ణి ప్రశ్నించారు. మెడిటేషన్‌లో ఉండగా నీకు ఆ సంభాషణఎలా విన్పించింది? నీ దృష్టి హృదయం మీద అంతర్ముఖమై ఉండాలి. కాని వారి మీద ఎందుకు ఉంది?

ధ్యాన సమయంలో ప్రారంభ దశలో దృష్టి నిలిపేటప్పుడు కొంత భిన్నత్వం (ఎవేర్నెస్) ఉండవచ్చును గాని క్రమంగా ధ్యానంలో (ఆసక్తి) తీవ్రతరమైన కొలదీ ఆ (డైవర్షన్) ప్రక్కదారి పట్టడం ఆగిపోతుంది.

**ప్రశ్న:** కరగి పోవటానికి, లయమై పోవటానికి మధ్య సంబంధం ఏమైనా ఉన్నదా?

**జవాబు:** కరగి పోవటమంటే ధ్యానంలో మునిగి పోవటానికి చేసే ప్రయత్నం. లయంకావటం అంటే అందులో పూర్తిగా మునిగి పోవటం, కలిసి పోవటం. ఒక పదార్థం నీటిలో పడినప్పుడు కరిగే ప్రారంభదశను, పూర్తిగా కరిగిపోయిన దశను ఉదాహరణగా చెప్పవచ్చును.

**ప్రశ్న:** తేలికదనం,వ్యాకోచం (వ్యాప్తి చెందటం) అంటే ఏమిటి? ఆ రెండింటికి సంబంధం ఉందా? అభ్యాసి వాటిని ఎలా గుర్తించగలడు?

**జవాబు:** తేలికదనం (బరువు లేమి) అనుభవమైనంత సేపూ

వ్యాపించటం ఉండదు. ప్రతి ఆధ్యాత్మిక దశలోను ముందుగా తేలికతనం వచ్చి తరువాత వ్యాపించినట్లు అవుతుంది. కాని రెండూ సమాంతరంగా ఒకేసారి అవగతం కావు.ఒక స్థితి యొక్క అనుభూతిలో తేలికయినట్లుంటుంది. ఆ స్థితి దాటి పురోగమించి నపుడు ఆ తేలికదనం తెలియదు. వ్యాపించటమన్నది హృదయంలో కొంత భాగానికి మాత్రమే పరిమితం. హృదయస్థానం దాటిన తరువాత పురోగమనంలో, హృదయంలో మిగిలిన భాగమంతా వ్యాపిస్తుంది. అంతకు మించి వ్యాప్తి చెందే అవకాశం లేదు.

దీనిని గ్రహించటమెలాగు? అని అడిగితే ఇందులో కిటుకు (టెక్నిక్) ఏమీ లేదు. నీవు ధ్యానంలో మరీ మరీ లోతుగా వెళ్ళిన కొద్దీ దాని అనుభవమవుతుంది.

**ప్రశ్న:** నిర్మాణం అంటే ఏమిటి? నశింపు అంటే ఏమిటి?

**జవాబు:** మన సహజ మార్గ పద్ధతికి ఈ ప్రశ్న సహేతుకం కాదు. అయినా విస్తరణ (ఎక్స్‌పాన్షన్) నిర్మాణాత్మకమైనదిగాను, సంకోచం (కాంట్రాక్షన్) వినాశకరమైనదిగాను చెప్పవచ్చు. మరో విధంగా చెప్పాలంటే సాధించేది దివ్యత్వం, నశించేది అహంకారం. ఈ రెండూ మన సిస్టమ్‌లో ఉన్నాయి.

**ప్రశ్న:** ఉన్నత స్థాయిలోను, దిగువ స్థాయిలోను అంతర్వాణిని గ్రహించటం ఎలా?

**జవాబు:** బాబూజీయే మాస్టర్! ఇంటర్ కమ్యూనికేషన్ అన్నది ఆయనకే సాధ్యం! కానిఅభ్యాసికి కాదు. ఆయన ఎప్పడు తలిస్తే అప్పడు తన దివ్య శక్తితో 'అంతర్వాణి'ని వినిపించగలరు. అభ్యాసి పూర్తిగా తనను తాను మరచి లయావస్థను కూడా దాటి ఇంకా ఉన్నత దశలలో ఉండి తాను ఒక కలం పట్టుకుంటే దానంతట అదే వ్రాసుకుంటూ పోతుంది. ఆలోచనతో పనిలేదు. చెప్పాలంటే

నోటి నుండే అనర్గళంగా వాగ్ధార వెలువడుతుంది. అంతా ఆ దివ్యశక్తి ప్రభావమే. నేను వ్రాసేటపుడు ఏమి వ్రాస్తున్నదీ, ఏమి మాట్లాడుతున్నదీ నాకు తెలియదు.అంతా బాబూజీ మహరాజ్ ప్రేరితమే. బాబూజీ వ్రాశారంటే - ఆయన దివ్యపురుషుడు కనుక అది సాధ్యం. ఏ దివ్య శక్తికైనా ఆదేశాలిచ్చి వ్రాయించగలరు. మనం 'మాస్టర్' కాదుగదా! మనం వారిలోనే మునిగిపోయి వారు వ్రాయించినట్లే ఆయన కృపతో వ్రాస్తున్నాం. ప్రశ్న ఉదయించగానే జవాబు వెలువడుతుంది. ఇది అభ్యాసి స్థాయి. కాని 'మాస్టర్' స్థాయి మహోన్నత మైనది. ఆ స్థితిలో వారు 'అంతర్వాణి' రచించారు.

**ప్రశ్న:** అభావం (శూన్యత - నెగేషన్) అంటే ఏమిటి?

**జవాబు:** తాను ఉన్నాననే భావన లేకపోవటమే అభావం (శూన్యత-నెగేషన్) అని, బాబూజీ చెప్పారు.

మనం పరమాత్మ (ఆదిశక్తి)లో లయమవుతున్నా ఇంకా మన వెనుక ఏదో అంటి ఉన్నట్లు భావన అప్పుడప్పుడు కలుగుతుంది.ఈ భావం కూడా పోయి పూర్తిగా అభావం ఏర్పడినప్పుడు ఆ స్థితి (కండిషన్) అభావం నుంచి అభావం (నెగేషన్ ఫ్రం నెగేషన్) అవుతుంది. ఇందుకు ఉదాహరణ ఏమిటంటే - మడుగులో నిశ్చలంగా ఉన్ననీటిలో చిన్న రాయి విసిరితే చలనం కలుగుతుంది. చిన్న తరంగాలు కదలాడుతాయి. కొంత సేపటికి అవి బలహీనమై మళ్ళీ నిశ్చలత ఏర్పడుతుంది. ఇంకా చెప్పాలంటే తాను లేననే భావం, తరువాత మాస్టర్ ఉన్నారనే భావం ఇంకా పురోగమించి ఆయన ఉనికి కూడా లేదనే భావం! దీనినే అభావం, అభావం నుంచి అభావం అని వర్ణించవచ్చు. దైవం మీద నిగ్రహంతో ధ్యానం చేస్తే నేను (అహం) ఉన్నట్లు నిపించదు. 'నేను' అన్న వేరు భావం ఉన్నట్లయితే 'లయ' ఎలా ప్రాప్తిస్తుంది?

ఒకసారి నేను బాబూజీకి ఇలా వ్రాశాను -

గతంలో నాలో మీరు ఉన్నట్లుగాను, మీలో నేను ఉన్నట్లు గాను భావన ఉండేది. ఇప్పుడు అలాంటి భావన రావటంలేదు. ఎందుచేత? బాబూజీ దానికి సమాధానంగా - ఒకప్పుడు నీవు నన్నే ధ్యానించేదానవు, స్మరించేదానవు. నీ ధ్యాస అంతా నా వైపు మరల్చబడి ఉండేది. కాని ఇప్పుడు అది నా వంతు అయ్యి నా ధ్యాస నీవైపు మరలింది.కనుక నీకు ఆ అనుభవం రాదు, అని వ్రాసారు.

**ప్రశ్న:** (డీప్) లోతుగా ధ్యానమయ్యింది - అంటే ఏమిటి?

**జవాబు:** లోతుగా (డీప్) ధ్యానం జరగటమంటే అభ్యాసి తన భౌతిక అస్థిత్వాన్ని (ఉనికిని) పూర్తిగా మరచి (కోల్పోయి) దృష్టిని అంతర్ముఖం చేసి దివ్యం మీదే లగ్నం చేయుట. అలా తన ఉనికిని మరచిపోయినపుడు ధ్యానం బాగా లోతుగా ఉంటుంది. ధ్యానంలో మొదట మన ఉనికి యొక్క యెరుక ఉన్నా క్రమక్రమంగా అది తగ్గి బాబూజీ మనకు దర్శనమిస్తారు. ఎల్లవేళలా అంతర్దృష్టితో జీవిస్తూ ఉంటే ధ్యానముద్రలో లేకపోయినా ధ్యానంలో ఉన్నట్లవుతుంది.

**ప్రశ్న:** అస్థిత్వాన్ని కోల్పోవటం మరియు లోతుగా ధ్యానం చేయటం ఈ రెండూ వేర్వేరు ఎందుకవుతాయి?

**జవాబు:** ఈ రెండూ వేరుగా ఉంటాయి. ఉనికి తెలియని స్థితి ఒకటైతే ఇంకా పురోగమించి ధ్యానంలో నిశ్చలంగా మునిగిపోవటం డీప్ మెడిటేషన్.

**ప్రశ్న:** ధ్యానం యొక్క పురోగతిలో స్థబ్దత (నిల్చిపోవడం) అంటే ఎలా ఉంటుంది?

**జవాబు:** పురోగతిలో స్థబ్దత అనేదిలేదు. ఆ భావానికి మన మనస్సే కారణం. ఒక స్థితిలో మనకు ఆనందం కలిగాక అక్కడే ఉండాలి అని కోరుకుంటాం. కనుక అదే దర్శనం కలుగుతూ ఉంటుంది.

మాస్టర్ యొక్క ఇచ్ఛా శక్తితో మన పురోగతి ముడిపడి ఉంటుంది. అందుకు మన 'అహం' (నేను) వదిలి పెట్టాలి. ధ్యానంలో ఉండగా దివ్యశక్తితో అనుసంధానమవుతాం. కళ్ళుతెరవగానే మళ్ళీ 'నేను' (అస్థిత్వం) ప్రత్యక్షమవుతుంది. మనలో ఉన్నది దివ్యప్రకాశము - ఆ దివ్య ప్రకాశం ఆయనదే. మనం పురోగతి (ప్రోగ్రెస్) చెందాలంటే బాబూజీతో మనకెప్పుడు లంకె (కనెక్షన్) అవుతుంది, ఎప్పుడు సాక్షాత్కారం లభిస్తుంది అనే ఉద్వేగం, తపన ఉండాలి. అప్పడే ప్రోగ్రెస్ (పురోగతి)కి అవకాశం ఉంటుంది.

కస్తూరిగారు తమ గీతాన్ని ఆలాపించి, దాని వివరణ ఇచ్చారు. మనందరిని తరింపజేసి భూమా (అంతిమం) కి చేర్చడానికి బాబూజీ ఆ భూమా నుండి అవతరించారు. మనం గతి తప్పకుండా పురోగమించడానికి జాగ్రత్త చర్యలు తీసుకుంటూ వారు బాధ్యత తీసుకుంటున్నారు. లాలాజీ సాహెబ్ సాధనా ఫలంగా అనంతం నుండి బాబూజీ అనే అమూల్య రత్నాన్ని సంపాదించి మనకు అందించారు. మన 'అహం' పూర్తిగా కరిగిపోతే మనకూ ఆ రత్నం లభిస్తుంది. అంటే బాబూజీలో మనం లయం అవుతాం. అప్పడు బాహ్య ప్రపంచం మనల్ని ఆకర్షించలేదు. ప్రాపంచిక దృష్టి మనలో నశించి బాబూజీలోనే లయమై పోతాము. అలా లయమైనప్పడు బిందువు సింధువు (సాగరం)లో కలిసి సింధువే తానయినట్లయి బాబూజీ యొక్క దైవశక్తి మనదే అవుతుంది. ఆ ఆనందం వర్ణనాతీతం.

సంధ్యా సమయంలో సూర్యుడు సింధూర వర్ణంలో ప్రకృతి చేత మనోహరంగా భాసిస్తున్నట్లే భూమా నుంచి అవతరించిన బాబూజీ ఈశ్వరీయ ప్రకాశంతో వెలుగొందుతూ ఉంటే ఆ మనోహర రూపం ఒక్క కస్తూరికే కాదు సమస్త మానవాళికీ

మనోహరంగా దృశ్యమానమవుతుంది. సూర్యుడు తన కాంతి కిరణాలను అంతటా ప్రసరింపజేస్తున్నట్లే బాబూజీలో లయమై పోయిన తరువాత మనమూ వారి దివ్యశక్తి  కిరణాలను అందరికీ ప్రసరింపచేయాలి. మనం పొందిన ఆనందాన్ని అందరికీ పంచి ఇవ్వడం మన విధిగా గుర్తించాలి. అంటే దివ్యత్వం వైపు ఇతరులను కూడా ఆకర్షింపజేయాలి.

**ప్రశ్న:** బాబూజీ మహా సమాధి పొందక పూర్వం ఆయన జీవిత ఘట్టాలను వర్ణించి చెప్పండి.

**జవాబు:** అన్ని విషయాలు నేను వ్రాసిన "వారు ఎవరంటే" మరియు "సాక్షాత్కారము నుండి అనంతము వరకు" అను గ్రంధాలలో ఉన్నాయి.  వాటిని చదివి గ్రహించండి. మీరు గ్రహించటమే కాదు - ఇతరుల చేత కూడా చదివించండి.

ఈ సందర్భంగా ఒక సంఘటనను వివరించారు.

ఒకసారి బాబూజీ కొద్ది రోజులపాటు అనారోగ్యంగా ఉన్న సందర్భంలో 'వారి'కి పరిచర్యలు చేస్తున్న వారు, 'వారి' దర్శనానికి వచ్చిన అభ్యాసులను ధ్యానం చేయవద్దని ఆదేశించారు.  బాబూజీ వారినపుడు వారించి అలా చెప్పవద్దన్నారు. "అనారోగ్యం భౌతిక శరీరానికి-హృదయానికి  కాదు.లోపలి దైవశక్తి పనిచేస్తూనే ఉంటుంది. దాని ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది.  ఆంతరికం శరీరం అదుపులో ఉండదు" అని  తెలియ చెప్పారు.  మనం కూడా అనారోగ్యంగా ఉన్నా ట్రాన్స్‌మిషన్ గ్రహిస్తూనే ఉంటాము.

ఒకసారి మా సోదరికి అస్వస్థతగా ఉన్నప్పుడు బాబూజీకి లేఖ వ్రాశాను. ఆయన తమ కృపను ప్రసాదించారు.  ఆమెకు గుండె జబ్బు ఉన్నదని కూడా మాకు తెలీదు. బాబూజీ ట్రాన్స్‌మిషన్ ఇచ్చారు. అప్రయత్నంగానే ఆమె తన చేతిని గుండె మీద ఆన్చి ఉంచేది.

బాబూజీ ప్రసారం చేసిన ఆ దివ్యశక్తి ఆ భాగాన్ని ప్రభావితం చేసి ఆరోగ్యం చేకూర్చింది. శారీరక దౌర్బల్యం వల్ల ఆ శక్తి ధాటిని తట్టుకోలేదు కనుక రక్షణగా బాబూజీ సంకల్పం ప్రకారం చేయి అలా అడ్డుపెట్టుకోవటం జరిగింది.

మనం ధ్యానంలో ప్రోగ్రెస్ అవుతున్న కొద్దీ బాబూజీ మనకు బాగా సన్నిహితం అవుతున్నట్లు గ్రహిస్తాము. బాబూజీ మహా సమాధికి పూర్వం షాజహాన్‌పూర్‌లో వారున్నా మనకు ట్రాన్స్‌మిషన్ వచ్చింది. బాబూజీ మహాసమాధి అనంతరం కూడా మనకు ట్రాన్స్‌మిషన్ వస్తూనే ఉంది. మహాసమాధి భౌతిక శరీరానికి గాని ఆత్మకు కాదు.

**ప్రశ్న:** బాబూజీకి, మీకు మధ్య ఉన్న అంతర్వాణి గురించి వివరించండి.

**జవాబు:** అంతర్వాణి (ఇంటర్ కమ్యూనికేషన్) ఎవరికి లేదు. మీ అందరికి కూడా ఉంది. బాబూజీ అందరికీ దర్శనం ఇస్తూనే ఉన్నారు. ప్రతి కండిషన్ లోనూ ప్రోగ్రెస్‌తోమాస్టరీ అవుతుంటే ఇంకా ఏముంది - మాస్టరీయే మాస్టర్.

**ప్రశ్న:** ఒక అభ్యాసీకి వ్యక్తిగతంగా సిటింగ్ తీసుకునే అవకాశం లేకపోయి నప్పటికి ధ్యానంలో తపన ఉంటే ఇతర అభ్యాసీలతో సమానంగా దివ్యశక్తిని పొందే అవకాశం ఉందా?

**జవాబు:** బాబూజీని ఒక అభ్యాసి తనకు వ్యక్తిగతంగా సిటింగ్ ఎందుకివ్వటం లేదని అడిగినప్పుడు - వ్యక్తిత్వాన్ని నశింపు చేయడానికే ధ్యానము కాగా ఇంకా వ్యక్తిత్వం ఎందుకు? అని సందేహ నివృత్తి చేశారు.

మీకు మీరుగా ఇంట్లో కూర్చున్నా, సత్‌సంగ్‌లో కూర్చున్నా వ్యక్తిగతంగా సిటింగ్ తీసుకున్నా అభ్యాసి యొక్క స్థాయిని బట్టి

బాబూజీ నుండి ట్రాన్స్‌మిషన్ అందుతూ ఉంటుంది. సత్‌సంగ్‌కు రాలేకపోతున్న సందర్భాలలో ప్రశిక్షకునికి తెలియ పరచి నిర్ణీత సమయంలో ఇంటి వద్ద ధ్యానంలో కూర్చుంటే కూడా ఫలితం దక్కుతుంది.

**ప్రశ్న:** సహజమార్గ అభ్యాసి కాని దైవభక్తుని యొక్క హృదయం తెరువబడే అవకాశం ఉందా?

**జవాబు:** భక్తుడు తన సాధనా స్థాయికి తగినట్లుగా లబ్ది పొందవచ్చును గాని సహజమార్గం అందుకు బాధ్యత వహించదు.

**సోదరి కస్తూరి గారు తమ స్మృతి పథం నుంచి మరికొన్ని విషయాలు చెప్పారు.**

దివ్య పథానికై ఇతర మార్గాలలో సాధనచేసి, సహజమార్గం సర్వోత్కృష్ట మైనదనీ దీనిలో ప్రవేశించిన వారిని గత సాధనలను విడిచి పెట్టమని ఆంక్ష పెట్టలేదు. సహజ మార్గం గొప్పదనే విశ్వాసంతో ఆచరణకు పూనుకున్నపుడు ఇతర పద్ధతులను విడనాడడానికి భయపడరాదన్నారు. దివ్యతేజస్సు లోపలే ఉన్నప్పుడు లోపలే ఆరాధించండి, బాహ్య పూజలు అనవసరం అన్నారు బాబూజీ.

బాబూజీ నాకొకసారి ఉత్తరంలో ఇలా వ్రాశారు. “నీవు పొందవల సినదంతా పొందావు. నీకింక నా సహాయం అవుసరం లేదు” అని. నేను బాబూజీని కలిసినప్పుడు ‘మీ సహాయం అవసరంలేదని ఎందుకు అంటున్నారు. మీరు నాకు ఆహారం పెట్టారు. ఆకలైతే తింటాను, ఆకలి లేకపోతే అవసరమనుకున్నపుడు తింటాను. శరీరానికి ఆహారం అవసరం లేదని ఎలా అంటారు. కనుక మీ సహాయం నాకెప్పడూ ఉండాలి’ అన్నాను.

ఇదే విధమైన జాబు బాబూజీ వరదాచారి గారికి కూడా వ్రాశారు. ఆయన ప్రత్యుత్తరమివ్వలేదు. నేను వరదాచారిని

కలిసినప్పుడు ఈ విషయం ప్రస్తావించాను. ఆయన తన పొరపాటును గుర్తించారు.

యుగపురుషులు అని చెప్పబడే రాముడు, కృష్ణుడు లాగానే మన **బాబూజీ కూడా యుగపురుషుడు. మళ్ళీ వేల సంవత్సరాల వరకు ఇటువంటి అవతరణ ఉండదు. అటువంటి దివ్యపురుషుని శిరోధార్యం గావించి వారిలో లయం కావాలి.**

మీవంటి పారమార్థిక వ్యక్తిని బాబూజీ మాలో పారమార్థిక చింతన చిగురింపజేసిమార్గదర్శకత్వం వహించటానికి మాకు ప్రసాదించారని భావిస్తున్నాము. అవునా? ఇలా అడగటం అసమంజసమే అయినా ఆమె బదులిచ్చారు.

బాబూజీ మా తండ్రిగారితో చెప్పారు.మీ కస్తూరి ఇక లేదు. ఆమె నాది, అని. ఇప్పుడు నీ ముందున్న కస్తూరి బాబూజీ కస్తూరి. మీరు కోరినపుడు బాబూజీలోనే దర్శించవచ్చు.

మనందరినీ దివ్య గమ్యానికి తీసుకొని వెళ్ళాలనేదే బాబూజీ సంకల్పం. అందుకు అనుకూలంగా మన తరపు నుంచీ మనస్ఫూర్తిగా, దీక్షగా ధ్యానం చేస్తూ మనల్ని స్వయంగా ఆయనలో లీనం చేసుకోవటానికి సాధన చేస్తే మనల్ని పైకి తీసుకొని వెళ్ళటానికి సహకరిస్తారు. తమ కృపను మనకు దానంగా ఇచ్చారు. ఇప్పడు కేంద్రంలో ఉన్న అభ్యాసీల ఆత్మలు తమ స్వశక్తితో అక్కడికి చేరుకోలేదు. కేవలం బాబూజీ అనుగ్రహంతోనే వారికి ఆ స్థితి సంప్రాప్తమయ్యింది. ఆయన పాదాల మీద మనం మోకరిల్లి అర్పణ చేసుకుంటే వారి ఆశీర్వాదం మనం పొందుతాము.

లయావస్థను గురించి మరొకసారి వివరిస్తూ ఇలా అన్నారు.

లయావస్థలో మనమున్న కండిషన్ మనకు అనుభవమవుతుంది. కాని దానిని వివరించలేము. ప్రగతి ఉంటుంది. కాని

దాని గమనం మనకు తెలియదు. నేను బాబూజీకి వ్రాశాను - నేను అద్దంలో చూసినపుడు నా ముఖం కన్పించటం లేదు. మీముఖమే కన్పిస్తోంది అని. లయావస్థలో ఆత్మ యొక్క ఉనికి తెలియదు. అంతటా ఆయనే దర్శనమిస్తారు.

ప్రెసెప్టర్లు (ప్రశిక్షకులు) బాగా కృషి చెయ్యాలి. ఇరవయ్యో, ముప్ఫయ్యో సిటింగ్స్ ఇవ్వడం ముఖ్యం కాదు. ఏది అభ్యాసీలు పొందాలని అనుకుంటారో, చెబుతారో ప్రెసెప్టర్లు వాటిని ఆస్థితులను పొంది, అనుభూతి చెందుట వలన అభ్యాసీలకు ఉపయోగం ఉంటుంది. **ఉదాహరణగా - బాబూజీ ప్రెజన్స్ (సన్నిధిని) ఫీల్ (అనుభూతి) అవడం.**

ప్రెసెప్టర్ల ముఖ్య కర్తవ్యం ఏమిటంటే అభ్యాసీలలో ఆధ్యాత్మికత పైన, సాక్షాత్కారం పైన తపన పెరిగేలా చేయాలి.

సంస్కారాలను దూరం చేయమని, రోగాలను పోగొట్టమని శ్రీ బాబూజీని కోరరాదు. దీని వలన వాటితో ఎటాచ్‌మెంట్ (బంధం) పెరుగుతుంది.

గమ్యం పొందాలని దృఢత్వంతో ఉంటే గమ్యం చేరుట తేలిక.

నలుగురికి తల్లి అయ్యి ప్రేమ పంచితే ప్రపంచంలో అందరికి ప్రేమ పంచవచ్చు - అందరికి తల్లి కావచ్చు.

ఒకసారి 'రాయ్‌జాదా' బాబూజీగారితో "మీరు సమయానికి సద్గురువులు" అని అన్నారు. అప్పడు బాబూజీ "మీరు సహజమార్గపు లిటరేచర్ (వాఙ్మయం - పుస్తకాలు) చదవలేదా! సమయమే సద్గురువు. ఈ సమయంలో ఇది చేయి, ఈ సమయంలో అది చేయి, అని చెబుతుంది. కనుక సమయమే సద్గురువు."

పెద్దవాళ్ళు చెప్పే మాటల్లో చాలా నేర్చుకోవాల్సింది ఉంటుంది.

ఒకసారి భీమసేనరావు అనే అభ్యాసి వ్యాపారంలో చాలా నష్టపోయి బాబూజీ వద్దకు వచ్చారు. సంభాషణలో మిర్చి గురించిన విషయం వచ్చింది. ఆ తరువాత భీమసేనరావు మిర్చి వ్యాపారం చేసి బాగా గడించారు. తరువాత ఆయన బాబూజీగారి వద్దకు వచ్చి "అంతా మీ కృప" అని అనగానే బాబూజీ "నేనేమి చేశాను. అంతా ఆ భగవంతునిదే నాదేముంది" అన్నారు. ఇక అర్థం చేసుకోండి మీరే!

బాబూజీ పట్ల ప్రేమ, సాక్షాత్కారం కోసం తపన ఉన్న అభ్యాసులే ఇక్కడికి వస్తుంటారు. అందుచేతనే వారిని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం. అలాగే బాబూజీపై ప్రేమ ఉన్న వారే స్థిరంగా - అభ్యాసంలో ఉంటారు. ఇంకొకరి మెప్పు కోసం వచ్చేవారు నిలవరు.

ఈ సంస్థకి ఇతర కేంద్రాల నుండి వచ్చేవారు బాబూజీని, కృపని పొందాలని, సాక్షాత్కారం పొందాలని - ఆ సంకల్పంతో వస్తారు. ఇది చాలా మంచిది.

మమ్మల్ని ఎందరో పిలుస్తారు. కొన్ని చోట్లకు వెళ్ళితే శ్వాస ఆడదు.

అన్నిటికంటే ముఖ్యం సిస్టమ్‌ని అర్థం చేసుకోవడం. సహజ మార్గంలో ఆధ్యాత్మికత కోసమూ, సాక్షాత్కారం కోసమూ తపించాలి.

ఏవైనా చెడ్డ ఆలోచనలు వచ్చినా బాబూజీ వాటిని సరిచేస్తారు. అలాంటపుడు మనం బాబూజీ చరణాల మీద ఉన్నామని భావిస్తే వాటంతట అవే పోతాయి.

ఈ సంస్థలో చేరినవారు- శ్రీ బాబూజీని పొందడం కోసం వారి చరణాలపై జీవించడం కోసం మరియు మన జీవితం ఆధ్యాత్మికత కోసమే - అని అనుకోవాలి.

ఎవరూ దీనిలో ఎక్కువా కాదు, తక్కువా కాదు.

శ్రీ బాబూజీ అనేవారు - ఆధ్యాత్మికతలో వినయం గొప్ప

వరం. ఎందుకంటే దానిలో ఆత్మ సమర్పణ ఉంటుంది. కాని షోయి (కృతక) వినయం మంచిది కాదు. అందులో ఆత్మార్పణ ఉండదు.

బాబూజీ అందరి గుణ దోషాలను చూస్తారు.

సిటింగ్ ఇస్తున్నప్పుడు మాత్రమే ప్రెసెప్టరు. మిగతా సమయంలో ఆయన కూడా ఒక అభ్యాసీయే.

ప్రపంచంలో అందరూ ఉంటారు. మన మిషన్ (సంస్థ) కు సంబంధించిన వాళ్ళు కూడా ఉంటారు. అంతమాత్రం చేత వారి మాటలు, సంభాషణలు నచ్చలేదని, వేరుగా ఉండాలని అనుకోకూడదు. అందరితోనూ కలసిపోవాలి.

సహజ మార్గం విధానం - తేలికైనదే కాని అమూల్యమైనది.

'పూజ' మొదలు పెట్టమని (స్టార్ట్) అంటారు కదా 'పూజ' అంటే విగ్రహారాధన కదా - అని ఒకరు అడిగారు. దానికి సోదరి కస్తూరిగారు "బాబూజీ పూజ అని అనరు. ధ్యానంలో కూర్చోండి" అని అంటారు. అలానే "మెడిటేషన్ ఓవర్" అంటారు. తప్పు కదా! అనంతాన్ని పొందేంత వరకూ ధ్యానం అంతం కాదు కదా!

సోదరి కస్తూరి గారు ఒక పాట వినిపించి దానిలోని భావం వివరించారు.

శ్రీ లాలాజీ ప్రార్థన వలన అంతిమం (అనంతం) నుండి దివ్యపురుషులు శ్రీ బాబూజీ అవతరించారు. "వారి" ధ్యానంలో మునిగి ఉన్న అభ్యాసుల హృదయాల్లోకి చూసిన అంతిమశక్తి మరియు లాలాజీ ఎంతో ఆశ్చర్యపోయారు. తాము ఒక్క బాబూజీని పంపగా వందల వేల బాబూజీలను ఆ హృదయాల్లో గమనించి! కనుక ఆ విధంగా అవడానికి మనం తయారు కావాలి. అదే ఆనంద భరిత సమయం!

మనం బాబూజీకి అంకితమైతే వారిలో లయావస్థ మనకు లభిస్తుంది. అప్పుడు మన అంతరంగంలో వారు ప్రత్యక్షమవుతారు. కనుక అలాంటి భక్తి ప్రేమలతో అంకితమై శరణాగతి పొందాలి. ఇదే అంతిమత్వానికి, లాలాజీకి, మనందరకీ కూడా ఆనందకర సమయం. ఇందు కోసమే మనకు తీవ్రమైన కోరిక ఉండాలి.

మెడిటేషన్‌లోనూ, నిరంతర స్మరణలోనూ బాబూజీ మనలను పైకి తీసుకొని వెళ్ళేటప్పుడు ఆనందం లభిస్తుంది. కొన్నిసార్లు లభించదు. ఇది తరువాత స్థితికి చేర్చడానికి బాబూజీ చేసే ప్రయత్నం మాత్రమే. ఆనందం పొందలేక పోతున్నామన్న సందేహం వీడి తరువాత స్థితికి చేరుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

ఆధ్యాత్మికతలో శ్రీ బాబూజీ ఈ విధంగా తయారుచేస్తూ తీసుకొని వెళ్తారు. దేనిలో మనం ఉంటామో (సహజమార్గం) దానిని గురించే మాట్లాడాలి.

**ప్రశ్న:** మనం మంచి విషయాలు ఆలోచించాలనుకుంటాము. కాని మెడిటేషన్ (ధ్యానం) లో చెడ్డ ఆలోచనలు ఎందుకొస్తాయి?

**జవాబు:** సహజ మార్గ విధానంలో బాబూజీ యొక్క నిరంతర స్మరణ అవసరం. స్మరణ అంటే - లక్ష్యము, లక్ష్య వస్తువును జ్ఞాపకంలో ఉంచుకోవడమే. అభ్యాసి 'వారి'నే చూస్తూంటే 'వారు' అభ్యాసిని చూస్తూనే ఉంటారు. 'వారి'నే ప్రేమతో స్మరణలో ఉంచుకోవాలి. 'వారి'తో నేరుగా అనుబంధం ఏర్పరచుకోవాలి. అప్పుడు చెడు ఆలోచనలనేవి రావు. లోపల బయట 'వారి' తోనే ఉంటే చెడు ఆలోచనలు రావు. 'వారు' మన ఎదుటనే ఉన్నారు. ప్రాణాహుతి ఇస్తున్నారు. మనం వారి దివ్యశక్తి ధారలో మునిగి ఉన్నాము - అన్న భావనలో ఉంటే చెడు ఆలోచనలు రానేరావు.

మనం పూర్తిగా 'వారి'లో మునిగిపోయి ఉండేంత వరకూ ఆలోచనలు వస్తాయి. ఈ ప్రయత్నంలో బయటి ఆలోచనలు రావు.

ఆలోచనా ధార తప్పు కాదు. కాని ఆలోచనలపై దృష్టి ఉంచడం తప్పు.

**ప్రశ్న:** అభ్యాసీగా చేరాలంటే 18 సంవత్సరాల వయస్సు ఉండాలన్న నియమం ఉంది. కాని 16 సంవత్సరాల వయస్సులో తపన ఉంటే, మిషన్‌లో చేరవచ్చా?

**జవాబు:** వద్దు. వాళ్ళని చదువుకోనివ్వండి. జీవితానికి కావలసినవి నేర్చుకోనివ్వండి. చేరినతరువాత "ఉదయం గంట ధ్యానం చేసుకోవాలి, సాయంకాలం క్లీనింగ్ (నిర్మలీకరణ) చేసుకోవాలి" అని బలవంత పెట్టవద్దు. పది నిమిషాలు కూర్చోనివ్వండి. పడుకోబోయే ముందు ప్రార్థన చేసుకోమని చెప్పండి. విద్య బాగా రావాలని కోరుకోమనండి.

వాళ్ళు ఎందుకు చేరుతున్నారో వాళ్ళకు తెలుసా? సాక్షాత్కారం అంటే తెలియదు. ప్రేయర్ (ప్రార్థన) చెప్పకోమనండి. రెండు విధాలుగా అంటే ఒకటి అర్పణ (ఆఫరింగ్). రెండవది - చదువు బాగా రావాలని. ఆధ్యాత్మికతకు యజమాని బాబూజీ. వారిదే స్పిరిట్యుయాలిటి (ఆధ్యాత్మికత). మనం ఏమీ చెప్పరాదు.

మొదట సాక్షాత్కారం పొందండి. తరువాత ప్రపంచంలో ఎంతైనా చెయ్యండి. అప్పుడు బంధం (అటాచ్‌మెంట్) ఉండదు.

అంతరంగం (ఇంటర్నల్)లో ప్రేమ కుదరాలని - ఈ విధానం (సిస్టమ్) గురించి పిల్లల ముందు మాట్లాడండి. అంతేగాని బాహ్య ప్రేమ కాదని.

సోదరి కస్తూరి గారింట్లో ఒక అబ్బాయి పరీక్షకు వెళ్ళేటప్పుడు

బాబూజీ ఫొటోకు దణ్ణం పెట్టి వెళ్ళాడు. కాని పరీక్ష బాగా వ్రాయలేదు. ఇంటికి వచ్చి బాబూజీగారిని - మీరు ముసలి వాళ్ళయిపోయారు - నాకు వద్దు. నేను వివేకానందునికి నమస్కారం చేస్తాను, అన్నాడట. మరుసటి రోజు పరీక్ష బాగా వ్రాశాడు. ఇంటికి రాగానే బాబూజీకి నమస్కారం చెప్పకున్నాడు. అంటే ప్రేమ అంతరంగంలో కాక బాహ్యంగానే వ్యక్తమైంది ఆ చిన్నవాడికి. మనం చేయవలసిన పని చేయాలి. పెద్దల యందు ప్రేమ గౌరవం పెంచుకోవాలి.

**ప్రశ్న:** ఎప్పడూ మెడిటేషన్ మూడ్ (ధ్యాన స్థితి)లో ఉండాలి అంటారు - అంటే ఏమిటి?

**జవాబు:** హృదయంలో బాబూజీ ఉన్నారన్న భావన, రోజంతా అలాగ ఉండ వచ్చును గాని మనస్సు మాత్రం ఎలర్ట్ (సంసిద్ధం)గా ఉండాలి. ఏమి జరుగుతుందో తెలుసుకోవాలి. మనస్సు భౌతిక, ఆధ్యాత్మిక విషయాల్లో చురుగ్గా నిశితంగా ఉండాలి.

ఒకసారి శ్రీరాయ్‌జాదాతో శ్రీ బాబూజీ "సహజ మార్గమనేది నిద్ర పోవడానికి కాదు. అంతరంగంలో కూడా మేల్కోవడానికి. అంటే ఏదో ఆనందం పొంది ఊరుకోవడం కాదు. ఎలర్ట్ (సంసిద్ధం)గా ఉండి కరిగి కలసిపోవాలి" అన్నారు.

నివేదన అంటే బాబూజీ, మనం వేరు కాదు - అనే భావన కాదు. 'వారి' హృదయంలో మనం మునిగి ఉండుట, అన్నారు బాబూజీ.

మనం భగవంతుని అంశ (భాగం). మొదట్లో అలానే ఉంది. తరువాత ఇది గ్రాస్ (స్థూలత)గా మారింది. కనుక సెల్ఫ్ (స్వ - అస్థిత్వం) ను ఆ దివ్య సాగరం (దైవం)లో కరగిపోయేలా చేయాలి. ఎలా అంటే నీటిని చూడండి. ముందుగా అది నీరు. తరువాత అది ఐస్ (స్వ)ని నీటి (దైవం)లో వేస్తే కరగి ఆ నీటిలో కలిసిపోతుంది.

సెల్ఫ్ (స్వ-అహం-అస్తిత్వం) ను చల్లబరచి స్థూలత్వంగా చేసుకున్నాము. తొలుత ఇది స్థూలం కాదు.నీటిని మాములుగా (సహజంగా) తొలిస్థితిలోనే ఉంచితే దాని (ద్రవ) స్థితి మారదు. ఆ నీటినే 'ఫ్రిజ్'లో ఉంచితే (స్థితి) మారిపోయి ఐస్ అవుతుంది. అనగా సెల్ఫ్ (స్వ)పై ఎగో (నేను, నాది అనే అహంకారపు) అనే పొరలనుఏర్పరచుకుంటున్నాము. అంటే ఈ తొట్టతొలి (దైవ) అంశకు అహంకారము, స్వ అను పొరలను కప్పి 'వారి' (దైవం)కి దూరంగా ఉంచుతున్నాము.

మనం బాబూజీకి దగ్గరి తనమును కలిగి 'వారి'లో మునిగి ఉండడం ద్వారా స్థూల రూపం (గ్రాసర్ ఫామ్) పోతుంది.

ఎగో (అహంకారము) ఎందుకు ఎక్కడి నుండి వచ్చింది - అన్న దానికి బాబూజీ ఇలా చెప్పారు.

సత్యయుగంలో అందరూ పని చేస్తూనే అంతరంగంలో భగవంతుని దర్శించుకుంటూ (చూస్తూ) ఉండేవారు. ఇందువల్ల బాహ్య కార్యాలకు ఏ ఆటంకం కలిగేది కాదు. తరువాత కాలం జరగ్గా జరగ్గా మనం మరెంతగానో భౌతికతగా మారి పోయాము. భౌతికతే మనం అయిపోయాము. పూర్తిగా భౌతికతలోనే నివసించడం వలన 'అహంకారం' ఏర్పడింది. అందుకని శ్రీ బాబూజీ అంతరంగ విధానం తెచ్చారు.ధ్యానంలో అంతర్ దృష్టి (లో చూపు) ఉంటుంది. దానితో సెల్ఫ్ (స్వ - పొరలతో సహా) కరగిపోతుంది.

ఎప్పుడైతే అంతరంలో 'వారి'ని నిలుపుకొని మునిగి ఉంటామో అపుడు భౌతిక విషయమేదైనా హృదయంలో చొరబడదు. మనస్సు చూసినా హృదయం చూడదు. నోరు చెబుతుంది. చెవి వింటుంది. కాని ఇవేవీ హృదయంలోకి చేరవు.

శ్రీ బాబూజీని ప్రేమతో హృదయంలో నిలుపుకుని, ఏ పని చేసినా వారి పైనే దృష్టి నిలపాలి.

జనక మహారాజు దగ్గరకు ఎవరో ఒక గురువు తన శిష్యుణ్ణి బ్రహ్మజ్ఞానం తెలుసుకోవడానికి పంపాడు. ఆ శిష్యుడు జనకుని వద్దకు వెళ్ళి ఆ విషయం చెప్పి, మాట్లాడాలన్నాడు. జనకుడు "నేను ఇప్పుడు మరో కార్యములో నిమగ్నమై ఉన్నాను. తర్వాత మాట్లాడుదాము. ఈలోగా మీరు మా అంతఃపుర శోభను తిలకించి రండి" అన్నారు. శిష్యుడికి ఆశ్చర్యం వేసింది. నిరసనా కలిగింది. జనసామాన్యంతో లౌకిక కార్యాల్లో మునిగిపోయిన ఈ రాజు వద్ద బ్రహ్మజ్ఞానం ఏమి నేర్చుకోవాలి - అని. అయినా గురువుగారి ఆజ్ఞ ప్రకారం జనకరాజు మాట గౌరవించి 'సరే' అన్నాడు.

అప్పుడు జనకుడు "అయ్యా! అంతఃపురమును చూసేటప్పుడు మీరు మీ చేతిలో ఈ ఆముదపు దీపాన్ని ఉంచుకుని - అది ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరిపోకుండా చూసుకోవాలి. అప్పుడే మీ కోరిక తీరుతుంది" అన్నాడు. శిష్యుడికి ఈ నిబంధన వింతగా ఉన్నా, అంగీకరించి అలానే దీపాన్ని చేతిలో ఉంచుకొని విజయవంతంగా తిరిగి వచ్చాడు.

జనకుడు తిరిగివచ్చిన శిష్యుణ్ణి చూసి "అయ్యా! మా అంతఃపుర శోభ మిమ్మల్ని ఆనందపరచి ఉంటుంది. మీరు చూసిన విశేషాలు చెప్పండి" అని కోరాడు. శిష్యుడు క్షణం ఆలోచించాడు. ఏమి చెప్పడానికి నోరు పెగల్లేదు. ఇక తప్పక "రాజా! మీరు చెప్పినట్లే దీపాన్ని తీసుకుని అది ఆరిపోకుండా చూసుకుంటూ తిరిగి వచ్చాను. ఏకాగ్రతతో దీపాన్నే చూసుకుంటూ తిరగడం వలన మీ అంతఃపుర శోభ సంగతే గమనించలేక పోయాను. మన్నించండి" అన్నాడు.

జనక మహారాజు నవ్వుతూ "మహాశయా! అదే దృష్టితో అంటే నా అంతరంగంలో నా దైవాన్నే చూస్తుండగా నా ఎదుటనే ఈ రాజ్య వ్యవహారాలు, లౌకిక కార్యాలు అన్నీ జరిగిపోతున్నాయి. నాకు ఇవేవీ దృష్టిలో లేవు - నాకు నా దైవం తప్ప. నీవు తెలుసుకోవాల్సింది ఇదే! ఇంతే" - అన్నాడట.

మనందరి దృష్టి అలా అంతరంగంలో ఉండాలి. మన దైనందిన కార్యాలు నిర్విఘ్నంగా జరిగిపోతాయి - ఏ ఆటంకం లేకుండా.

మనకు ఇష్టమైనవారు (అతిథి) మన ఇంటికి వస్తే ఎంత పనిలో మనం ఉన్నా వారిపైననే మన దృష్టి ఉంటుంది. మనస్సంతా ఆ వైపే ఉంటుంది.

అలా కాకుండా ఎవరో మనకు ఇష్టంలేని వారు వస్తే ఎదురుగా ఉన్నా మనం చూడం. ఎప్పుడు పోతారా అనుకుంటూ చిరాగ్గా ఉంటాం.

అంటే దైవం (బాబూజీ) మనకు ఇష్టమైన వారు. వారి పైననే మనస్సు, దృష్టి ఉంటుంది, ఉండాలి! అలా కాని ఇతర ఆలోచనలన్నీ - ఇష్టం లేనివన్నమాట, వాటిపై మనస్సు ఉండదు. దృష్టిపోదు.

ఇలా, మన దృష్టి, మనస్సు ఆ దైవం, మన బాబూజీ మీదనే ఉండాలి. ధ్యానంలో తపన ఆవిధంగా ఉండాలి. మనం అంటాము - ఆలోచనలు వదలడం లేదని. కాని బాబూజీ అంటారు - మనమే ఆలోచనలను వదలడం లేదని.

మన ప్రేమ 'వారి' కోసమే. మనం ప్రేమతో 'వారి' ఎదురుగా కూర్చొని దృష్టి 'వారి' మీదే ఉంచితే - మనం ఏమీ కోరుకోక పోయినా మాస్టర్ ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు.

అభ్యాసీలు కొందరు సిటింగ్‌కు వస్తారు. కాని లోపల సిటింగ్ కావాలని కాదు. అప్పుడు బాబూజీ అతనిలో ఆ కోరిక కలిగిన తరువాతనే సిటింగ్ ఇస్తారు.

మెడిటేషన్ (ధ్యానం) మొదలు పెట్టమని అడుగుతారు. కాని అప్పటికే ట్రాన్స్‌మిషన్ జరిగిపోయి ఉంటుంది.

కొందరు సోదరి కస్తూరిగారికి ఆరోగ్యం బాగోలేకపోయినా సిటింగ్ అడుగుతారు. ఆరోగ్యం బాగోలేదని చెప్పినా వినరు -ఎంతో దూరం నుండి వచ్చామంటారు. అప్పుడుఇచ్చే సిటింగ్ మెకానికల్‌గా (యాంత్రికంగా) ఉంటుంది.

మనం అడగకపోయినా బాబూజీపై మనలోగల ప్రేమ వలన వారు మనకు సిటింగ్ ఇస్తారు.

**లవ్ మోర్ - సీ నియర్.**

**చూపు - ఎంతో ప్రేమ. చూడు మరెంతో దగ్గరగా ఉండి.**

శ్రీ రామచంద్ర మిషన్‌లో చాలామంది అభ్యాసీలున్నా - బాబూజీని అంతరంగం లో కలిగిన వారే నిజమైన అభ్యాసీలు.

అందరూ అనంతంలోనికి వెళ్ళితే నా ఇల్లు చిన్నదైపోతుందని ఆ అనంతం అనుకుంటుందా!

మెడిటేషన్ అంటే 'వారి'ని ధ్యానములో ఉంచుకొనుట. 'వారి' చరణాలపై ఉన్నామని భావించాలి. మంచి ఆలోచనలు, మంచి భావనలు ఉండాలి.

**ప్రశ్న:** సెల్ఫ్ (స్వ)కు, అంతిమంకు లింక్ ఉంటుందా?

**జవాబు:** ఉండదు.

బ్రైటర్ వరల్డ్ దాటిన తరువాత ఏడు వలయాలుంటాయి. ఆ బ్రైటర్ వరల్డ్‌లో శ్రీ లాలాజీ, శ్రీ స్వామి వివేకనంద ఉన్నారు.వారి

"స్థితి"ని వదలి వచ్చి బాబూజీకి సహాయం చేస్తారు. ఎవరైనా ఈ బ్రైటర్ వరల్డ్ దాటగానే 'వారి' కంటే గొప్పవాళ్ళమనుకొనరాదు. 'వారు' సహాయం చేయాలంటే అక్కడకు రావలసిందే!

మాస్టర్ (బాబూజీ) అంతిమం నుండి వచ్చారు మనందరిని తీసుకొని వెళ్ళడానికి. మనకు ఆయన ఇల్లు చూపించారు. అక్కడికి వేగంగా (త్వరగా) చేరుకోవాలంటే మధ్యలో డీవియేషన్స్ (ప్రక్క దారులు) ఉండరాదు. ఎలాగంటే చిన్నపిల్లలు మధ్యలో ఆటలాడు కుని ఇంటికి ఆలస్యంగా వస్తారు. అలాకాక నేరుగా వచ్చేస్తే త్వరగానే ఇంటికి చేరుకుంటారు కదా! - అలాగన్నమాట.

మనం కలం పట్టుకుంటాము. ఏది వ్రాయాలో, ఎవరు వ్రాయిస్తున్నారో ఆ కలానికి తెలియదు. మనకూ తెలియదు. ఏది ప్రశ్నయో, మరేది సమాధానమో మనకు తెలియదు.

శ్రీబాబూజీ చెప్పదలచుకోనిది ఎక్కడా చెప్పబడలేదు. ఆధ్యాత్మికతలో ఏ లిటరేచర్ (వాఙ్మయం) లో లేనివి 'వారు' చెప్పారు. "ఇక్కడి నుండి అనంతం వరకు అన్ని రహస్యాలను విశదమయ్యేలా ఉంచాను" అని 'వారు' అన్నారు.

సహజ మార్గము ప్రవేశపెట్టింది రోగాలను నయం చేయడానికి కాదు (భవరోగాన్ని నయం చేయడానికి).

మనం సహజమార్గ విధానమును అనుసరించుచున్నాము. అంటే - మెడిటేషన్, సతత స్మరణ, నిర్మలీకరణ (క్లీనింగ్), రాత్రి చెప్పకునే ప్రార్థనా - ఇంతే కాదు.

కాని సహజ మార్గములోనికి రావాలి అంటే - సహజంగా ధ్యానంలోకి వెళ్ళగానే బాబూజీ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడం కావాలి. అదే సహజ మార్గాన్ని అనుసరించడమంటే.

మంజిల్ (గమ్యం) చాలా ఎత్తులో ఉందనుకుంటే, 7 అంతస్థుల భవనం ఎక్కాలన్నా కష్టం. కాని లిఫ్ట్‌లో ఉంటే కష్టం తెలియకనే పైకి వెళ్ళతాము.

అలాగే సహజమార్గం అనుసరిస్తే (లిఫ్ట్ అనుకుంటే) సునాయాసంగా గమ్యం చేరతాము.

గురువు శరీరంపైన ధ్యానం చేసేవారు గురు పశువు అవుతారు.

గురువు దేహం విడచిపోయినా వారినే, భగవంతునిగా భావించి శక్తి పొందితే వారు గురు భక్తులవుతారు.

మనలను 'సాక్షాత్కారము'నకు దివ్యశక్తితో వారు తీసుకొని వెళ్ళతారు. ఆ శక్తిపై అధికారం ఎవరికి ఉంటుందో వారే డివైన్ మాస్టర్.

ప్రేమతో వారి సాన్నిధ్యాన్ని పొందవచ్చు.

రెండు రకాల వాలంటీర్లు ఉంటారు. అందులో ఒక వర్గం వి.ఐ.పి వాలంటీర్లు. వీరు ఆజ్ఞలు జారీ చేస్తారు. అంతే!

రెండవరకం వారు - మాస్టర్ భావనలో మునిగి పని చేసేవాళ్ళు. వీరికి బాబూజీ ఆశీస్సులు ఉంటాయి. మొదటి వర్గం వారికి ఏమి ఉపయోగం ఉండదు.

మాస్టర్ దృష్టి అందరి మీదా ఉంటుంది. వారు అందర్నీ పరిశీలిస్తూ ఉంటారు.

ఇక్కడ గ్రహించినదంతా పూర్తిగా ఎబ్జార్బ్ చేసుకుని (జీర్ణించుకుని ఇంకించు) కోవాలి.

రోజువారి పనులలో ఏమేమి, ఎలా చేయాలి అనుకుంటూ విపరీతపు ఆలోచనల్లోమునిగిపోరాదు. బదులుగా ఆ సమయమంతా

సతత స్మరణలోనే ఉంటూంటే ఆయా పనులన్నీ సరైన పద్ధతిలో ఎలా జరగాలో అలా సవ్యంగానే జరిగిపోతాయి. ఆయా కార్యకలాపాలన్నీ నిరంతర స్మరణలోనే జరిగి పోవడం వలన నీ ప్రమేయం ఉండక పోవడం వలన ఏ సంస్కారాలు నీకు అంటవు.

**లోతుగా ధ్యానంలో మునుగు!**

**వాస్తవానందం పట్టి తెచ్చుకో.**

ఎవర్నీ ద్వేషించకుండా ఉంటే - అందర్నీ ప్రేమించవచ్చు. అందర్నీ ప్రేమించ గలగడం అనేది ఎంత కాలంలో సిద్ధిస్తుందంటే - మొదలు పెట్టడమే తరువాయి పూర్తి అవుతుంది - అన్నారు కస్తూరీజీ.

బాబూజీ అన్నారు కదా -"అందర్నీ నేను ప్రేమిస్తాను. కానీ ఎవరూ అది చూడరు (గుర్తించరు)" ఈ విషయం సోదరి చెబుతూ బాబూజీ చెప్పే ప్రతి మాటలోనూ ఎంతో లోతైన అనుభవం ఉంటుంది- అన్నారు.

"నేను నిజం చెప్పడానికి ప్రయత్నిస్తా. కాని కొన్నిసార్లు (అప్రయత్నంగా) దానంతటదే అబద్ధం వచ్చేస్తుంది" అని కొందరంటారు - దీనికి మంచి మార్గం మౌనంగా ఉండడమే - అని సోదరి చెప్పారు.

**ప్రశ్న:** సంస్కారాల నుండి మనం ఎప్పుడు విడుదల అవుతాము?

**జవాబు:** చిన్న పిల్లవానిగా అయితే సరి! ఇక స్థూలత్వం రాదు. చిన్న పిల్లవానిగా మారిపో. కాని తనంత తానుగా అలా అవడం కష్టం. కాని బాబూజీ (సముఖంలో) ముందు అది తేలిక.

బాబూజీ ఎదుట పెద్ద మనుషులు కూడా చిన్న పిల్లలై పోతారు.

"సాధకునికన్నా నాకు సైనికుడే మిన్న", ఇది బాబూజీ మాట. క్రమశిక్షణ ముఖ్యాతి ముఖ్యం - అని వారి ఉద్దేశ్యం.

"సమస్యలకు బానిస కారాదు" - అన్నారు 'వారు'. వంద విషయాల్లో మనకు సంతోషం కలిగినా ఒక్క విషయంలో కలిగిన బాధనే పట్టుకు వ్రేలాడి కృంగిపోతాము. అలా సంతోషం కలిగించని వాటికే ప్రాముఖ్యతనిచ్చి ఉండిపోవడంతో ఆనందకర విషయాలు కూడా మనం గుర్తించకుండానే మనల్ని దాటిపోతాయి. కష్టాలు వస్తాయి అనే బాధతో ఉన్న సుఖాలను కూడా కోల్పోతాము.

ప్రతివారూ చెడుపైనే ధ్యాస ఉంచి మంచిని అశ్రద్ధ చేస్తారు. ప్రజలు విచారపు ఆలోచనలనే ఇష్టపడతారు. అలాకాక మనం మంచి పనులకు, మంచి వార్తలకే ప్రాముఖ్యత నివ్వాలి. సంతోషకరం కాని వాటిని, చెడ్డ వాటిని మనం వదలివేయాలి - అన్నారు సోదరి కస్తూరిజీ. అందుకు ఉదాహరణగా ఈ సంఘటన చెప్పారు.

ఒకసారి మన అభ్యాసీలు ప్రయాణించుచున్న రైలుకు ప్రమాదం జరిగింది. గురుదేవుల కృప వలన ఏ ఒక్కరూ గాయపడలేదు. కాని వారు ఏడవడం చూసిన సోదరి ఆశ్చర్యపోయి "ఎందుకు అలా ఏడుస్తున్నారు? ఎవరికీ ఏమీ కాలేదు కదా!" అన్నారు. దానికి వారు "ఒకవేళ దెబ్బలు తగిలితే మేము ఏమయి పోయేవారం?" అని ఏడ్చేశారట.

మొదటి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న "ఝూన్సీ లక్ష్మీబాయికి ముక్తి లభించింది." అని బాబూజీ చెప్పగా ఆమెతో పాటు యుద్ధం చేసిన వారందరికి ముక్తి ఎందుకు రాలేదు మరి - అని ఎవరో అడిగారట.

దానికి బాబూజీ ఝూన్సీరాణి గురించి ఇలా చెప్పారు. ఆమె ఎప్పుడు ఏ పని చేసిన భగవాన్ కృష్ణుని స్మరించే చేసేవారు. ఆ

యుద్ధ సమయంలో ఆమె ఏడు రోజులు ఏమీ తినకుండా, త్రాగకుండా యుద్ధం చేసింది. ఆ విషయం దాసీలు అడుగగా - నేనుభగవాన్ శ్రీ కృష్ణ కృపారసాన్ని పానం చేస్తున్నప్పడు మిగతా రసాలతో నాకు పనేముంది- అన్నారట.

బాబూజీ మహరాజ్ - తమ ఎదురుగా అభ్యాసీలు కూర్చున్నప్పడు తానిచ్చే దానిని (దివ్యకృపను) స్వీకరించడానికి ఆ అభ్యాసీలు ఎలర్ట్‌గా (సంసిద్ధంగా) ఉండాలన్నారు. తమ ఎదుట మెడిటేషన్ మూడ్‌లో అభ్యాసీలు కళ్ళు మూసుకుని కూర్చుంటున్నారు. అలా కూర్చోవడం వలన అభ్యాసీలు తమ ప్రపంచంలో తాము మునిగిపోయి ఉంటారు.ఆ ఆలోచనలలోనే వారు తిరుగుతూ బాబూజీ మహరాజ్ గారివ్వగోరే దానిని పొందలేరు. ఆంతరంగికంగాను, బాహ్యంగాను ఎలర్ట్‌గా ఉండాలి. అప్పడే వారివ్వగోరే దానిని పొందగలరు - 'వారు' ప్రసారం చేయగలరు. దానిని హృదయంలోనికి స్వీకరించగలరు. అందుచేత సంసిద్ధతతో కూర్చోవాలి. అదే మర్యాద గౌరవం - అన్న విషయం కస్తూరిజీ వివరించారు.

తిరుపతిలో దేవుని చూడడానికి ఎంతో మంది కొండపైకి వెళు తున్నారు. జనులను చూడడానికి ఆ దేవుడే ఒకసారి క్రిందికి రాకూడదా - అన్నారట బాబూజీ ఒకసారి.

కళ్ళు మూసుకుని మెడిటేషన్ మూడ్‌లో ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చెందిన వారి ముందు కూర్చున్నప్పడు ధ్యానంలో ఏమి పొందగలవో దానినే పొందగలవు. కాని అంతర్ బాహ్యాల్లో ఎలర్ట్‌గా వారి ఎదుట ఉన్నప్పడు - అంతకన్నా ఎక్కువే పొందగలవు. అప్పడే బాబూజీని 'చూడడం' సాధ్యపడుతుంది.

అందుచేత ఉన్నత స్థాయిలోని వారి ఎదుట కూర్చున్నప్పడు కళ్ళు మూసుకుని ధ్యానములోకాని, ధ్యానస్థితిలోకాని ఉండరాదు. వారు ఏమి ఇవ్వనున్నారోనని ఎదురుచూస్తూ సంసిద్ధంగా ఉండాలి.

ఒకసారి కస్తూరిగారు బాబూజీని కలిసి తిరిగి వెళ్ళిన తరువాత జాబు వ్రాసారట. "బాబూజీ! ఈసారి మిమ్మల్ని చూసినట్లే లేదు నాకు" అని.

దానికి ప్రత్యుత్తరంగా బాబూజీ "ఇంతకు ముందు వచ్చినావుకాని నన్ను చూడకుండానే వెళ్ళిపోయినావు. ఇప్పడు మొదటిసారిగా నన్ను చూసావు" అని.

అంటే ఇంతవరకు చూసింది బాహ్యాన్నేనని, ఇప్పడు చూసింది అంతరంగ రూపాన్నని - నిజతత్వాన్నని - అర్థం.

**ప్రశ్న:** ప్రేమకు, దివ్యప్రేమకు గల భేదం ఏమిటి?

**జవాబు:** ప్రేమ ఇద్దరు వ్యక్తుల మధ్య ఉంటుంది. ప్రేమించే వారొకరు, ప్రేమించబడే వారొకరు. ఇద్దరు ఉంటారు ఇక్కడ. ఇది ప్రేమ.

బాబూజీని ప్రేమిస్తాము. అది బాబూజీకి అర్పణమైపోతుంది. మనం వారిని ప్రేమిస్తున్నామన్నదే మరచిపోతాము. ఇక్కడ ప్రేమించబడే వారు ఒక్కరే. వారే దైవం.'వారు' మన గుర్తులో ఉన్న ధ్యాసే మనకు ఉండదు. వారు మనల్ని గుర్తు పెట్టుకోవడం వలన మన ధ్యాస (దృష్టి) వారి మీదే ఉంటుంది. ఇదే దివ్యప్రేమ!

తెలివి తక్కువ వానికి ఒకేబాట. (దేవుని త్రోవ) తెలివి తేటలున్న వానికి (ఎంతో ఆలోచిస్తారు కనుక) ఎన్నెన్నో దారులు.

బరువు ఎత్తుకున్న గాడిద వెనుక నుండి ఎవరూ తోలక పోయినా తిన్నగా దాని స్థానానికి అది వెళ్ళిపోతుంది. కాని తెలివి ఉన్నవారు అలా (త్రోవల్లో) తిరుగుతూనే ఉంటారు.

బాబూజీ హాస్యంగా ఈశ్వర్ సహాయ్ గారితో "నేను అభ్యాసులను బుద్ధిహీనులుగా తయారు చేస్తున్నానని అందరికి చెప్పకండి" అన్నారట ఈ విషాయాలు చెబుతూ.

ప్రతి అభ్యాసి ధ్యానంలో ఎంతో కొంత పొందుతాడు.

"సంతోషంగా ఉండడానికే నీవు సహజ మార్గంలో చేరావు. కనుక ఉద్రేకపడవద్దు. అరవ వద్దు. వాస్తవంగా ఉద్రేకాలు తొలగించుకోవాలి. నన్నెప్పడు చూసినా, సంతోషంపొందాలి. అరవడం అనే విధానం మార్చుకోవాలి.  బాబూజీ నీ ఎదుటనే ఉన్నారు. సంతోషంగా ఉండండి" అని సోదరి కస్తూరిగారు ప్రేమగా చెప్పారు.

**ప్రశ్న:** లయావస్థకు, మెర్జింగుకు గల భేదం ఏమిటి?

**జవాబు:** 'లయ' అభ్యాసి నుండి మాస్టర్ లోనికి ఉంటుంది. మెర్జింగ్ బాబూజీ నుండి.మెర్జింగ్ ఒక్కసారే జరిగింది. ఇకముందు జరగబోదు. అంటే లాలాజీ బాబూజీలో 'మెర్జ్'అవడం.

నది సముద్రాన్ని చేరడం - లయ!  సముద్రం నదిలోనికి చేరదు (రాదు). అభ్యాసీ అంటే నది.  బాబూజీ అంటే సముద్రం - అన్నమాట.

దివ్య సాగరంలో మునిగిపో. ఎన్నటికీ బయటికి రావద్దు. ఎంత లోలోతుల్లో ఆదివ్య సాగరంలో నీవు మునిగిపోయి పైకి రాకుండా ఉంటావో అదే లయావస్థ. లోలోతుల్లో ఆ దివ్య సాగరంలో మునిగిపోయి, లయావస్థకు స్థితిపై, స్థితిగా నీవు చేరతావు. నీవు మునిగిపోయిన కొలదీ నీ అహంకారం కరగిపోతుంది. అప్పడు లయావస్థలోని అంత్యస్థితికి చేరతావు.

దివ్య పురుషుని అవతరణకై లాలాజీ 'భూమా'ను ప్రార్థించగా బాబూజీ అవతరించారు. భూమాశక్తి అత్యంత శక్తివంతమైనది. కనుక బాబూజీ భౌతిక శరీరం దానిని తట్టుకోలేకపోవచ్చు. ఆ శరీర రక్షణ కోసం లాలాజీ బాబూజీలో మెర్జ్ అయ్యారు.

లాలాజీ తన అన్ని శక్తులను బాబూజీ పరం చేసినా లాలాజీ అనుమతి లేనిదే ఏ శక్తినీ బాబూజీ వినియోగించలేదు. ఎప్పుడూ వారిని క్షణమైనా మరువలేదు. అదే 'వారి' మర్యాద, మన్నన.

బాబూజీ మహరాజ్ చెప్పిన విషయం - నన్ను గుర్తుకు తెచ్చుకోండి. అక్కడ నేను ఉంటాను. అది ఎలాంటి గుర్తు (స్మరణ)? ఆ గుర్తు, ఆ స్మరణ హృదయానికి బంధమై (లంకెయై) ఉండాలి.

జీవితమునకు పరమ లక్ష్యమును ముందు ఏర్పరచుకోవాలి. ఈ లక్ష్యముయొక్క స్మరణ ఎటాచ్‌మెంట్ (అనుబంధము) కు దారితీస్తుంది. అనగా మన లక్ష్యమును ఎన్నడుమరువరాదు. ఈ విధముగా లక్ష్యమును సతతము గుర్తుంచుకొనుటయే సంకల్ప ముగామారును. ఒకవేళ మనము లక్ష్యము నుండి దూరముగా వెడలినను ఈ సంకల్పమే మనలను చేరువ చేయును. ఈ సంకల్పమే దృఢమైనచో మనలను లయావస్థకు చేర్చును.

అభ్యాసుల సంకల్పమునకు, బాబూజీ సంకల్పమునకు భేదము కలదు. అభ్యాసి సంకల్పము బాబూజీ (దైవము) యందు లయమగుట. కాని బాబూజీ వారి సంకల్పమునందు సమస్త ప్రాణులలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుట ద్వారా లయావస్థకుచేర్చుట. కాని కొంత కాలము పిమ్మట రెండునూ ఒకదానితో ఒకటి సమానము అవుతాయి.

సత్యపథ్ దైవశక్తి (గాడ్లీ రీజియన్) పైన ఉన్నది. భూమా, అంతిమం (అల్టిమేట్) ఒక్కటే.

దేని నుండి అయితే సృష్టి ప్రారంభమైనదో ఆ అంతిమం నందు దైవిక శక్తి (గాడ్లిపవర్) ఒక బిందువు మాత్రమే.బాబూజీ అంతిమం నుండి వచ్చారు. అవతారం దైవికశక్తి నుండి వచ్చింది. ఇదియే ఒక అవతారము నకు, బాబూజీకి గల భేదము.

"మిమ్మల్ని సంతోషపెట్టాలంటే ఎంతగా ప్రేమించాలి" అని బాబూజీని ఒకరు అడిగారు.

"నిన్ను నీవు ప్రేమించుకునే దానికన్నా ఎక్కువగా" అని అన్నారు.

"నేను" అనేది బాబూజీతో సంధానమై ఉండాలి.

"నిన్ను నీవు మరచావు (కోల్పోయావు) అంటే నన్ను (బాబూజీని) గుర్తుంచుకున్నావు."

గుర్తుంచుకోవడమంటే నిన్ను నీవు మరిచిపోవడమే! నిన్ను నీవు మరచిపోవడానికి నిన్ను బాబూజీకి సంధానం చేసుకోవాలంతే!

నేను చెబుతున్నాను, నేను చేస్తున్నాను అనుకున్నప్పుడల్లా బాబూజీకి ఆ 'నేను'ను అనుసంధానం చేయి - అంతే. ఇక ఎల్లప్పుడూ ఆయనే గుర్తుంటారు. ఇక నీవు ఉండవు. ఇది అసాధ్యం కాదు కాని కొంత సాధన అవసరమని అన్నారు సోదరి కస్తూరిజీ.

మోడరేషన్ అనగా సమభావం సమస్థితి. ఇది ప్రయత్నపూర్వకంగా గాని, కృతకంగా గాని రాదు. ధ్యాన సాధన ద్వారా ఇది పొందగలం. ఎవరినీ ద్వేషించరాదు. అందరూ నా వారే అనుకోవాలి.

అవసరాన్ని బట్టి ఆగ్రహం వ్యక్తీకరించినా ఆ వెంటనే మామూలు స్థితికి రావాలి.

మాట కరుకుగా ఉన్నా హృదయం మెత్తగా, సున్నితంగా ఉండాలి.

షాజహాన్‌పూర్‌లో ఒకసారి బాబూజీ ఒక నౌకరుతో బిగ్గరగా మాట్లాడారు. ప్రక్కనేఉన్న వరదాచారిగారు "బాబూజీ మీకూ కోపం వస్తుందే" అన్నారంట. దానికి బాబూజీ "నాకేమీ కోపం రాలేదే! నేను ఆ నౌకరుతో అలానే మాట్లాడుతాను. అయినా నా అంతర్ స్థితిలో భేదం ఏమీలేదు" అన్నారు.

బాబూజీతో అనుబంధాన్ని మీరు పెంచుకొని ధ్యానం మొదలు పెడితే తక్షణం ప్రాణాహుతి ప్రసారం (కృపాధార) మొదలవుతుంది. బాబూజీ నావారు - అను భావనఉండాలి. అప్పడే ధ్యానంలో ధార మొదలవుతుంది. అంతేకాని మనస్సుతో లగ్నం చేయడానికి ప్రయత్నిస్తే జన్మంతా వృధా అయిపోతుంది కాని "వారి"ని పొందలేము.

బిడ్డ అవసరాలు ఏ ప్రయత్నం లేకుండానే తల్లికి సహజంగానే తెలుస్తాయి. సరియైన అభ్యాసి ఎప్పడూ బాబూజీ స్మరణలోనే ఉంటాడు. అతడు ఆ స్మరణకై మనస్సు పెట్టనక్కర లేదు. నిరంతర (సతత) ధ్యానంతో బాబూజీని నీ వారిని చేసుకోవాలి. ప్రయత్నపూర్వకంగా స్మరణలోనికి తెచ్చుకోవడం కాదు. బాబూజీ దృష్ట్యా "వారు" మనలోనే ఉన్నారు. మనం వారితోనే అనుబంధాన్ని స్థిరపరచుకోవాలి. బాబూజీ జ్ఞాపకం అప్రయత్నంగా దానికదే అప్పటికప్పడు వచ్చి గాఢమైన ప్రేమ కలిగినదై ఉండాలి.

ఇలాంటి గాఢ ప్రేమ కొనసాగితే కొంత కాలానికి ప్రేమ మిగిలి 'జ్ఞాపకమునే' మర్చి పోతాము.

అనుభూతి భగవంతుని భాష -అంటారు బాబూజీ.

బాబూజీని "మీకు ఏ సెంటర్ అంటే ఇష్టం" అని ఒకరు అడగ్గా "నేను వారి వైపుదృష్టి సారించేలోగా -వారే నా దృష్టిని తమ వైపు మళ్ళించే విధంగా నా శ్రద్ధను త్రిప్పకుంటున్న - ఆ సెంటర్ అంటే ఇష్టం" అన్నారు.

అనగా బాబూజీ యందు ప్రేమ, భక్తి ఉన్నవారే 'వారి'ని పొందగలరు.

"నా దగ్గరకు వచ్చి వెళ్ళిపోతున్న ఆభ్యాసులు తిరిగి నా వద్దకు

ఎప్పుడు మరల వద్దామా అనే తపనతో ఉంటారు. అలాంటి వారి రాక కోసం ఎదురు చూస్తుంటాను" అన్నారు బాబూజీ.

వెళ్ళిపోతున్న అభ్యాసులు "బాబూజీ ఇల్లు మా ఇల్లు. ఈ ఇంటికి తిరిగి ఎప్పుడువస్తామా అన్న తపనతో ఉండాలి. తినడానికి, ఉండడానికి అన్నీ ఉంటాయా, సమకూరతాయా అన్నదాన్ని పట్టించుకోరాదు."

ఏ పని చేసినా ఆఫీసు పనిగాని, ఇంటిపనిగాని ఏదైనా సరే బాబూజీ కోసమే, వారి సంతోషం కోసమే ఆ పనులు నిర్వహిస్తున్నామన్న భావనతో చేయాలి. అప్పుడు అందువలన లభించే కష్ట సుఖాలు, సమస్యలు అన్నీ వారికే చెందుతాయి - అన్న భావంకూడా ఏర్పడుతుంది.

ఫకీర్ అంటే ఏమిలేనివాడు. దైవ సన్నిధికి వచ్చినప్పుడు -తిరిగి వెళ్ళేటప్పుడు కూడా ఏమీ లేనివాడే! ఏ బంధాలు లేవు. పూర్తి బంధ విముక్తుడు అతడు. సెయింట్‌స్థితికి, ఫకీర్ స్థితికి భేదముంది.

ఏ అవస్థలో (స్థితిలో) ఈశ్వర సాక్షాత్కారాన్ని సహజ పద్ధతిలో పొందినామో దానినే 'సహజావస్థ' అంటారు. ఈశ్వరుని పొందుట ఈ విధంగా సహజము.

ఈశ్వరుడు ఒక్కడే - రెండు, అనుభావన (ద్వైతభావన) లేని చోటనే ప్రేమ ఉంటుంది - అని కబీరు చెప్పారు.

తపన పెరిగిపోయినప్పుడు ఎరుకలేని మగత స్థితిలోని ఆ సమయమంతా మనము భగవంతుని యొక్క అంతరము నందే ఉన్నామను ఎరుక (జ్ఞానము) మనకు కలుగును. వారు మనలోనే ఉన్నారు -అను విషయము తెలిసి ఆశ్చర్యపోతాము.

సంకల్పము సిద్ధించినచో దానిని ఇక 'స్థితి' అనము.

ఎందుచేత నంటే ఎన్నెన్నో స్థితులు దాటి లక్ష్యసిద్ధి పొంది 'స్థితి లేని స్థితిని' (బేహోల్) చేరుకున్నాము.

సంకల్పము (భగవత్ సాక్షాత్కారము) పొందిన వ్యక్తి మాత్రమే స్థితిలేని స్థితిని పొందినవాడు.

ఈశ్వరునితో యోగమునకై (కలయికకై) కోరిక పెరిగినంతనే ఆభ్యాసిలో పురోగతికై కోరిక అంతమవుతుంది. ప్రధాన లక్ష్యము (ఈశ్వరుడు) కనుచూపు మేరలో యోగమునకు సాధ్యముగా ఉన్నందున అభ్యాసిలో పురోగతి కొరకై కోరిక తొలగిపోయి ఈశ్వర యోగమునకై తపన పెరుగును. లక్ష్యము చేరు వరకే ఉన్నతి అవసరమై ఉన్నది.యోగమునకై తపన పెరిగి, గాఢమై చివరకు ఈశ్వరయోగము ప్రాప్తించి తపన పరిసమాప్తమవుతుంది.

ఈశ్వరునిలో లయమును పొందిన స్థితిలో మనకు మన భౌతిక దేహముతో సంబంధము తెగిపోయి ఈశ్వరునితో సంబంధము ఏర్పడును. ఇట్టి స్థితిలో మనకు మన భౌతిక దేహము చైతన్యము లేని మృత దేహముగా కనిపించును. ఉన్నతమైన దానితో లయమును పొందిన కారణంగా మన దేహముతో మనకు సంబంధము తెగిపోయి అది మృతదేహముగా కనిపించును. భౌతిక దేహముతో మన సంబంధము కంటే ఈశ్వరునితో కలుగు సంబంధము (లయము) ఉత్తమమైనది.

ఒక స్థితి యొక్క అంతము మరొక స్థితి యొక్క ప్రారంభము. అనగా ఒక స్థితి యొక్క అంతము తరువాతి స్థితి యొక్క ప్రారంభానికి లంకె (ఆధారము) అగును.

సహజ మార్గ విధానంలో మిరకిల్స్ (చమత్కారాలు) అప్పటి అవసరాన్ని బట్టి జరుగుతాయి (సంభవిస్తాయి). వాటిని చూపడం లేక బహిర్గతం చేయడమనేది ఉండదు.

బాబూజీగారికి సంబంధించిన ఒక సంఘటన సోదరి కస్తూరిగారు ఇలా వినిపించారు. ఒకసారి కారులో ప్రయాణానికై సన్నాహం చేసుకున్నారు. పదే పదే దాన్నిగూర్చిన జాగ్రత్తలు బాబూజీ విచారించారు. "పెట్రోలు నిండుగా నింపాము. కారుకు సర్వీసింగ్, చెకప్‌లు వగైరా క్షుణ్ణంగా చేయించాము" అని సోదరి బాబూజీతో చెప్పారు. బాబూజీతో సహా కారు ఎక్కారు. స్టార్ట్ చేశారు. ఆశ్చర్యంగా అది రెండు ముక్కలైంది. అద్భుతం ఏమిటంటే ఎవరికీ ఏ ప్రమాదం జరక్కుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు.

సోదరి బిగ్గరగా నవ్వుతూ "బాబూజీ ప్రయాణం చేసే కారు ఇలా రెండు ముక్కలవుతుందని ఎవరం అనుకోలేదు" అన్నారు. ఈ విషయమై బాబూజీ మరీ మరీ పట్టించుకోవడమూ, కారు ముక్కలైనా, చమత్కారంగా అందరూ క్షేమంగా బయటపడడం మామూలుగానే జరిగినట్లయింది.

రాముడు కోదండపాణియై తనకు దర్శనం ఇచ్చినాడని రామభక్తుడు ఒకాయన బాబూజీతో అనగా, వారు "నీవు చూసింది సరైన భావ రూపం కాదు. రాముడు అంతర్వ్యాపి -అని తెలుసుకోవడమే వాస్తవార్థం. చిత్రాలు, ఫొటోలు చూసి అలా దర్శనం పొందామని చెప్పడం సరైన పద్ధతికాదు. బదులుగా నిర్గుణ, నిరాకార, నిరామయ భావమే సరైన భావం" అని అన్నారట.

శ్రీ రామచంద్ర మిషన్ యొక్క తేజాన్ని (ప్రభావాన్ని) దృఢ దీక్షతో భవిష్యత్‌లోనికి తీసుకొని వెళ్ళగల న్యాయశీలత కల పది మంది అభ్యాసీలను ప్రతి ప్రెసెప్టరు తీర్చిదిద్దాలి.

తక్కువ మందే అయినా ఈ అభ్యాసులు సహజ మార్గపు ప్రభావాన్ని, కాంతిని ఎక్కడైనా, ఎప్పుడైనా విస్తరింపజేయాలి.

బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమపూరిత ప్రాణాహుతి ప్రసారం వలన - అభ్యాసీల స్వయం కృషి లేకపోయినా - అప్రయత్నం గానే పరిసరాలు వాతావరణం మారిపోయి సహజ మార్గపు ప్రభావం (వెలుగు) విస్తరిస్తుంది.

ఇటువంటి అభ్యాసీలు నలుగురైదుగురున్నా వారి పరస్పర ప్రభావ కారణంగా వారున్న ప్రదేశం సహజ మార్గపు దివ్యత్వంతో ఉంటుంది. వారితోపాటు ప్రాణాహుతి ప్రసారం కూడా ఉండడం వలన ఇతరులు కూడా లబ్ది పొందుతారు. ఈ విధంగా సంస్థ అభివృద్ధి చెందుతుంది - అని అన్నారు బాబూజీ.

బాబూజీ మహరాజ్‌ను ఒక పండితుడు 'సత్యం, శివం, సుందరం' అంటే ఏమిటని అడిగాడు.

"ప్రతి దానికి రెండర్థాలుంటాయి. ఒకటి కృతకమైంది. రెండవది వాస్తవమైనది.నా గురుదేవులు లాలాజీ నాకు వాస్తవార్థాన్నే చెప్పారు" అంటూ "నేనే సత్యం, శివం, సుందరం" అన్నారు.

"ఇక్కడ 'నేను' అంటే సృష్టికర్త (క్రియేటర్)" అని సోదరి వివరించారు.

పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు - ధనికులు, పేదలు అనే తారతమ్య (భేద) భావంలేని వాడే అభ్యాసి - అని చెప్పారు బాబూజీ.

తమ తమ హృదయాల్లో బాబూజీని నిలుపుకుని వారి సన్నిధిని అనుభూతి - చెందునట్టి అభ్యాసులను ఉన్నతిలో ఉంచుతారు బాబూజీ.

అనంతము యొక్క దివ్య సౌందర్యమే సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలము). ఈ విషయము ఆధ్యాత్మిక గ్రంధాలలో ఎక్కడా వివరింప బడలేదు. ఎందు చేతననగా - అక్కడి నుండి అవతరించిన వారెవరూ లేరు. అక్కడికి చేరిన వారెవరూ లేరు. అవతారములన్నియు కేంద్ర మండలపు అధో స్థానము నుండి ప్రత్యేక విషయమై ప్రత్యేకశక్తితో అవతరించినారు. బాబూజీ మహరాజ్ మాత్రమే ఇది అంతా వివరించి అందరికి అర్థమగునట్లు వెల్లడి చేసినారు. బాబూజీ మహరాజ్ అనంతం నుండి అవతరించేవరకు- ఆధ్యాత్మిక గ్రంధాలు, మీరా, తుకారాం వంటి ఆధ్యాత్మిక మహనీయులు దైవము యొక్క నామ రూపాల గురించిన భావననే వివరించగలిగిరి.

మంచితనము, సన్మార్గ మార్గము అలవరచుకున్నప్పుడే మనలో ఆధ్యాత్మికతకు అర్హత లభిస్తుంది.

ప్రతివారికి నివసించడానికి ఒక ఇల్లు ఉంది. అందరు కలసి ఉండే ఒకే ఇల్లు కావాలి. అందులో ఉన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక బంధంతో ముడిపడి ఉండాలి. భౌతిక విషయాల్లోని దగ్గరితనం కాకుండా దైవిక స్వాభావతత్వంతో కూడిన దగ్గరితనంతో మనం ఉండాలి. అప్పుడే మనలో సామీప్యత లభించి ఆత్మీయత ఏర్పడుతుంది - అని సోదరి చెప్పారు.

“బాహ్య బంధము కన్నా అంతరంలోని బంధం మిన్నగా ఉండాలి” అని బాబూజీ నొక్కి చెప్పారు. బాహ్యాడంబరాలు బాగా తగ్గించుకోవాలన్నది బాబూజీ నమ్ముతారు.

ఎవరినీ ద్వేషించకూడదు. ఎవరినైనా ఇష్టపడక పోయినా దానిని అంతరంగ భావనలోనికి రానీయకూడదు. అవమానాలు

పొందినా వాటిని ఓర్చుకోమని ఆధ్యాత్మికత నొక్కి చెబుతుంది. ఓర్పును అలవరచుకోవాలి. ఆయా పనులు చెడ్డవి కాని-ఆ పనుల వెనక ఉన్న వ్యక్తి చెడ్డవాడుకాడు. బాహ్యంగా ఎంత ద్వేషం చూపిస్తే అంతగానూ అంతరంగంలో అది ఇంకుతుంది.

బాహ్యంలో నీవు ఎంతగా మునిగిపోతావో అంతగా బాహ్య ప్రపంచం పెంచుకుంటావు. దీనికి బదులుగా నీవు అంతరంగంలో (దైవంలో) ఎంతగా మునిగితే అంతగానూ దివ్యత్వాన్ని పొందుతావు.

బాహ్యం (ప్రపంచం) మాయా పూరితం.

అంతరం దైవరస పూజితం.

సృష్టికర్త ఒక్కరే! కాని సృష్టి కడు విశాలమైనది. సృష్టి పెరిగిన కొలదీ సృష్టికర్తకు దానిమీద ప్రేమా పెరుగుతుంది. అలాగే బాబూజీ శ్రీ రామచంద్ర మిషన్ సృష్టికర్త. శ్రీ రామచంద్ర మిషన్ ఎంతగా వ్యాప్తి చెందితే వారి ప్రేమ,మిషన్ కొరకు అంతగానూ పెంపొందుతుంది. ఈ పెంపొందిన ప్రేమను పొందిన అభ్యాసీలు అదృష్టవంతులు.

## లయావస్థ

ఐసు నీటి యెక్క ఘన రూపం. దీనిని నీటిలో ఉంచితే క్రమంగా కరగిపోతుంది.

దైవం మనలో ఉన్నా మనం గుర్తించడం లేదు. అంతర్ నేత్రంతో అంతరంగంలోవారిని చూసినప్పడు, ఆ వెంటనే అలా చూస్తున్న భావన కోల్పోయినప్పడు, తిరిగి రేకెత్తించి ప్రోత్సహిస్తుంది. దైవం గురించిన ఈ ప్రోత్సాహం "నేను" అన్న దానిని మాత్రం వదలి అహంకారపు పొరలను, అహంను కరిగించివేస్తుంది. ఆపై ఆ "నేను"కూడా దివ్యత్వంలో కరగిపోగానే అప్పటి ఆ స్థితినే 'లయావస్థ' అంటారు.

సముద్రంలో అట్టడుగు చేరిన వ్యక్తి యొక్క స్థితితో లయావస్థను పోల్చవచ్చు. ఆసముద్రంలో పూర్తిగా మునిగిపోయి తన్ను తాను కోల్పోయిన వ్యక్తి యొక్క అనుభవాన్నే లయావస్థ అందురు.

మనం నిరంతరం బాబూజీ మహరాజ్ స్మరణలోనే ఉండాలి. దీనికి (స్మరణకు) అడ్డు వచ్చే ఆలోచనలన్నీ వదలివేయాలి. మనం బాబూజీకే చెందిన వారమని దృఢంగా అనుకుంటే, అంతరాత్మ దానిని ధృవీకరించి నప్పడు, మన అనుబంధం 'వారి'తో పాదుకొల్పబడుతుంది. మరియు మన ప్రయత్నం సఫలమవుతుంది.

ఒక అభిలాషి బాబూజీ వద్దకు వచ్చి వారికి లక్షలాది రూపాయలను ఇవ్వజూపాడు. "ఈ లక్షాధికారులు, కోటీశ్వరులు శాశ్వతమైన ధనవంతులు కారు. వాస్తవానికి వారికి ఏ విలువా లేదు. ఎందుకు గాను నీవు వచ్చినావో, అందుగ్గాను నీ (సెల్ఫ్), హృదయాన్ని అర్పించుకో" అన్నారు బాబూజీ.

"ఏ కోరికలు లేకుండా హృదయాన్ని అర్పించడమే అత్యంత విలువైన అర్పణ" అని నొక్కి చెప్పారు బాబూజీ.

సృష్టిలో ఏది సుందరంగా ఉంది అనుకుంటామో అది అంతిమం లోని దివ్య సౌందర్యపు ప్రతిబింబమే! ఆ దివ్య సౌందర్యాన్ని చూడగలిగి నప్పడు, దాని విలువను గుణాధిక్యతను గ్రహించినపుడు ఆకర్షించ బడతాము. ఆ తరువాత దాని నిజ సౌందర్యమును దర్శించడం జరుగు తుంది. ఆపై పురోగమించ డానికి బాబూజీ మహరాజ్ వారి దివ్యాకర్షణతో సాక్షాత్కార స్థితికి తీసుకొని వెళతారు, అని సోదరి కస్తూరి చెప్పారు.

బాబూజీ మహరాజ్ యుగంలో జన్మించడం ఒక్కటే మనకు గర్వకారణం.

గురువు తన పేరు, ప్రఖ్యాతులు చెప్పకుని ప్రజలను అసహజంగా బందీలుగా చేసుకుంటున్నాడు. ఇలాంటి గురువుల అధ్యాయాల్ని ముగింపు చేయడానికే తాను వచ్చానని, బాబూజీ చెప్పారు.

భౌతిక బంధాన్ని త్రుంచి అంతిమానికి మనల్ని అను సంధానం చేయడానికే వారు వచ్చింది.

గొప్ప (ఋషులు) సెయింట్స్ అయిన మీరాబాయి, తులసీదాస్, సూరదాస్ తదితర మహనీయులకు గురువు లేరు. వారు ఆధ్యాత్మిక గ్రంథాలు, పెద్దల సూచనల వలన భగవంతుని పొందవచ్చని తెలుసుకుని నేరుగా ఆ భగవంతునితో అను సంధించుకున్నారు. ఈ ఆలోచన భగవంతుని యెడ అంతరంగంలో ప్రేమ ఏర్పరచుకోవడానికి దోహదమిచ్చింది. భగవంతునికై అంతరంగంలోనికి చూడాలి. ఎంతగానంటే అంతర్ నేత్రములు దైవాన్ని చూస్తుండగానే బాహ్య నేత్రములు బాహ్య ప్రపంచాన్ని చూచుకొనును. ఇది నీ అంతరంగం లోని దైవానికి నిన్ను నీవు సంధానం చేసుకున్నప్పడు జరుగుతుంది.

దైవ భావన రాగానే హృదయంలో దైవ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందాలి. బాబూజీ స్మరణలోనికి రాగానే ప్రాణాహుతి ప్రసారం మొదలైనదని భావించాలి.

హృదయపూర్వకమైన (నీ) ఒక్క ప్రార్థనతో నీవు అంతిమ సాక్షాత్కారం పొందడాన్ని త్వరితం చేస్తారు బాబూజీ.

ప్రాణాహుతి ధారాపాతం స్వీకరించే వాని లేక జీర్ణంచుకోగలిగే వాని సామర్థ్యంతోముడిపడి ఉంది.

**కృప:** భగవత్ కృపను జీర్ణంచుకునే శక్తి కావాలంటే కావలసింది ఆ దైవానుగ్రహమే. అంతిమ స్థితిని పొందినవారి హృదయపూర్వక ప్రార్థన మాత్రమే ఈ అనుగ్రహమును అందించగలదు.

అంతిమ స్థితిని పొందిన వారి ప్రార్థన వలన లభించిన కృపను సంపూర్ణముగా జీర్ణంచుకునే శక్తిని కూడా అను గ్రహించమని వారే ప్రార్థించుదురు.

భగవదనుగ్రహము అనగా, దివ్య కృపాధారను జీర్ణించుకునే స్థితి అని, సోదరి కస్తూరి వివరించారు.

మానవాళిని ఉద్ధరించడానికి గురువు బాధ్యత వహిస్తారు. ఆత్మను అంతిమంతో అనుసంధించగల ప్రావీణ్యత కల దివ్య పురుషుడే సద్గురువు.

కస్తూరిజీ తనను 'సోదరి'అని పిలుచుట వలన ఎంతో సాన్నిహిత్యం కలుగుతుందని - అలా పిలుపించుకొనుటయే ఆమెకు ప్రియం - ఇష్టం. 'సోదరి' అని కాకుండా మరోలాపిలిపించుకుంటే సాన్నిహిత్యం కలుగదని ఆమె భావన.

సహజ మార్గ విధానమున ధ్యానము చేయనప్పటికి అంతరంగము నందు దైవ సాన్నిధ్యమును అమితముగా అనుభవించానని, కాని ఈ సహజ మార్గ విధానమును అనుసరించినా ఆధ్యాత్మిక అనుభవములలో అప్పటి అటువంటి ఉన్నతిని కలిగించలేదనిసోదరి బాబూజీతో ఒకసారి అన్నారు.

"ఒక విధానంలో మనం సాధన చేసేప్పడు గురువు భౌతిక పరిధిలో ఉంటాడు. ఆ సాధన దాటి మనం ముందుకు వెళ్ళి అంతరంగమున స్థిరముగా 'వారి'ని మాత్రమే చూడగల క్రమశిక్షణ అలవడినప్పడు, దివ్యానుభవాన్ని పొందుతాము" అంటూ బాబూజీ విపులీకరించారు.

"స్పృశించకుండా (అభ్యాసి చేయి కూడా పట్టుకోకుండా) దివ్యత్వానికి తీసుకొని వెళ్ళగలిగేవారే సద్గురువు." అని బాబూజీ విడమరచి చెప్పారు.

సోదరి పులకరించి పోయి తన అనుభవాన్ని ఇలా చెప్పారు. "బాబూజీ మహరాజ్‌నన్ను అనంతంవైపు వెంట తీసుకొని వెళుతూ చిన్నపిల్ల చేతులను పట్టుకున్నట్లుగా నా చేతుల్ని పట్టుకున్నారు. తిరిగి చేతుల వైపు చూసుకున్నప్పడల్లా బాబూజీ నా చేతుల్ని పట్టుకున్నట్లే లేదు. కాని అదే సమయంలో ముందుకు చూస్తే శ్రీ బాబూజీయే ముందుకు తీసుకొని వెళ్ళడం కనపడింది" అని చెప్పారు.

ఆ యాత్రలో సద్గురువులు శ్రీ బాబూజీ మహరాజ్‌కు తనకు మధ్య కొంత దూరాన్ని (ఖాళీ) ఆమె చూసారు. ఆ దూరం తనకు బాబూజీ మహరాజ్ వారి రెండు చేతులకు మధ్యనే అన్నది తెలిసింది. ఈ దూరమే, ఖాళీ- ఈశ్వరుడు లేదా భగవంతుడు. ఈ ఖాళీ "రూపము"ను దాటించడానికే, బాబూజీ మహరాజ్ తానే అట్టి పెట్టారు, అని సోదరి విపులీకరించారు.

బాబూజీ మహరాజ్ తమ దివ్య కృపాధారతో సాధకులను అంతిమ స్థితికి తీసుక వెళ్ళి - 'వారు' భూమా నుండి అవతరించిన కార్యమును నెరవేరేట్లు చేస్తారు - అని సోదరి ఈ సందర్భంగా అన్నారు.

ఈ వర్తమాన కాలము మానవులందరిలో ఆధ్యాత్మిక మార్పునకై ఆధ్యాత్మికతతో పరిపుష్టి నొందినది. యోగ్యతా యోగ్యతలు ఎట్లున్నా దివ్య ప్రాణాహుతి ద్వారా అందరికి ఆధ్యాత్మిక శక్తినిచ్చి స్వగృహానికి (అసలు ఇంటికి) తిరిగి రమ్మనిన దాని పిలుపును గుర్తించవలసి ఉంది. టూకీగా చెప్పాలంటే జనన మరణ చక్రం నుండి మానవుని విడుదల చేయడం ప్రస్తుతానికి 'అంతిమం' యొక్క బాధ్యత.

సోదరి ఇలా చెబుతూనే బాబూజీ మహరాజ్ ఎప్పడూ ఇలా అంటూండేవారని ఆ విషయం చెప్పారు.

కాలంతో కొలిస్తే మానవుని పతనం కూడా విస్తారమైనదే. సత్యయుగం నుండి కలియుగానికి మానవుని పతనం తలచుకుంటే అంటే మానవుని ఇప్పటి గుణహీనతకు (దిగజారి పోవడానికి) నాలుగు యుగాల కాలం పట్టింది.

మరో మాటలో చెప్పాలంటే కాలము, అవతరించిన అవతారాలు అడ్డుకోవడం వలన - అవి దిగజారిపోవడానికి ఇంకా ఎక్కువ సమయం పట్టింది. అందుచేత మానవ పతనంతో పోలిస్తే అతనిలో ఆధ్యాత్మిక పరిణామం మృదువుగా, శీఘ్రంగా జరిగింది. మానవుని విముక్తికై భూమా నుండి అవతరించిన బాబూజీకి ఆ పని చాలా తక్కువ సమయంలోనే పూర్తి అయ్యింది.

ఒకసారి దొంగతనం చేసినంత మాత్రాన వానిని దొంగ అని అనకూడదు. దొంగతనం మరోసారి చేసినప్పడు, ఆ దొంగతనం చేశానన్న అపరాధ భావం అతనికి లేనప్పడు తప్ప అతడిని దొంగ అని పిలువరాదు.

కాబట్టి దొంగతనం చేస్తున్నానన్న అపరాధ భావం అంతరంగంలో లేనివాడే దొంగ. అదే విధంగా మానవాళి కూడా ఒకరిని ఒకరు -ఏ విధమైన జాలి, కరుణ అనేవి లేకుండా చంపుకునే స్థాయికి చేరారు. ఇలాంటి దిగజారిపోయిన మానవ విలువలను (జాలి, దయ) పునరుద్ధరించడానికే దివ్యపురుషులు (స్పెషల్ పర్సనాలిటి) అవతరించారు.

పోగొట్టుకున్న మానవ విలువలను ఉద్ధరించడానికి మానవుడు తనకు తానే విముక్తుడు కాలేడు. కాబట్టి అతని సహాయార్థము 'అనంతం' నుండి దివ్య ప్రాణాహుతిప్రసారం అతనిలోనికి అతని ఆభివృద్ధి నిమిత్తం ప్రవేశ పెట్టబడుతుంది.

**ప్రశ్న:** ధ్యానం కొనసాగుటలో అడ్డు ఎందుకు వస్తుంది?

**సోదరి:** మన గత జన్మలన్నిటిలో మన మనస్సుకు ఏ లక్ష్యం లేకుండా తిరగడాన్ని నేర్చాము. బాబూజీ తెలియ పరచినదేమంటే - ఆంతరికం ఎప్పుడూ మెడిటేషన్‌లోనే ఉన్నందున ధ్యానం కొనసాగుతూనే ఉంటుంది. మనస్సు మీద ఉన్న గతజన్మల సంస్కారాల ప్రభావం వలన మనస్సు అంతరంలోని మెడిటేషన్‌కు ఎలర్ట్ (సంసిద్ధం) అవడంలేదు. కనుక ఎప్పుడైతే కొనసాగుతున్న ధ్యానం తప్పుతుందో అప్పుడు మనస్సును సున్నితంగా 'అంతరం' లోనికి త్రిప్పాలి.

మెడిటేషన్ (భావ) స్థితిలో ఉండడం ధ్యానంలో కొనసాగు తున్నట్లు కాదు. బదులుగా దినచర్యలన్నీ పూర్తి చేసుకుంటూనే అంతరంగానికి అంటుకుని ఎలర్ట్‌గా (సంసిద్ధంగా) ఉండడమే తెలివైన పని.

బాబూజీ మహరాజ్ ఒక మాట అంటూ ఉంటారు. "పూజలో కూర్చోండి"అని. దీనిలో మనం గ్రహించవలసిన సూక్ష్మమైన విషయం ఏమిటంటే - అంతరంగంలో మెడిటేషన్ (పూజ) ఎప్పుడూ జరుగుతూనే ఉంది. మనం దానికి సంసిద్ధంగా ఉండడమనేదే సాధనలో ఒక భాగం. కాబట్టి "పూజ మొదలు పెట్టండి" అని చెప్పడం సరికాదు. ఎందుచేతనంటే పూజ (మెడిటేషన్) జరుగుతుంది - ఆగుతుంది, అన్న విధంగా ఇది ఉంది. కనుక 'పూజ'లో కూర్చోండి అన్నదే సరైన మాట.

**ప్రశ్న:** ఆలోచనలు రావడానికి కారణం ఏమిటి?

**సోదరి:** అవి మనకు ఇష్టం, కనుక వస్తాయి. ప్రతి అభ్యాసి దైవ సాన్నిధ్య భావంతో ఒక గంట ఆంతరిక 'పూజ' చేయాలి.

దైవ సాన్నిధ్య భావానికి బదులుగా పూజలో మనం ఆలోచనల మీదనే ధ్యాస పెట్టడం వలన ఆలోచనలు వస్తున్నాయి. దీనికి కారణం ఆలోచనపై కలిగే ఇష్టమే. ప్రతి అభ్యాసి పూజలో కూర్చున్నప్పుడు 'వారి' (దైవం) సాన్నిధ్యం కోసం ఎదురు చూస్తాడు. కాని 'వారి' సాన్నిధ్యాన్ని పొందలేక పోతున్నాడు. ఎందుచేతనంటే తన ఆలోచనల్లో తాను ఉండిపోయి -అటూ ఇటూ (చెదరి) పోవడం వలన. బాబూజీ మాత్రం సిద్ధంగా ఉండి ఆ అభ్యాసి ఎప్పుడు తనపై దృష్టి పెడతాడా అని చూస్తూనే ఉన్నారు. ఇది ఎలా ఉందంటే బాబూజీని అతనిపై (అభ్యాసి పై) పూజ చేసేందుకు పిల్చినట్లుంది. వాస్తవంగా బాబూజీపై ధ్యానం చేసుకోవడానికి 'వారి'ని అంతరంగం లోనికి తెచ్చుకోవాలి. ఈ విధంగా మానవుడు తన ఆలోచనల్లోనే మునిగిపోవడం స్వాభావికమై పోయింది.

ఒక పిల్లవాడు యువకుడైన తరువాత ఉద్యోగం కోసం తిరుగుతూ ఉంటాడు. రు.3,000/- జీతంతో ఒక ఉద్యోగం దొరుకుతుంది. ఆ తరువాత అది చాలక కుటుంబ పోషణకని రు.6,000/- జీతమున్న ఉద్యోగం కోసం వెదుకుతూ బాధ పడతాడు. అతడి తండ్రీ అదే విధంగా ఈ జీతంతో తన బిడ్డ కుటుంబాన్ని ఎలా పోషించగలడా, అని బాధపడతాడు.

కనుక మానవుడు ఇలాంటి ఆలోచనలతో, బాధలను పెంచుకు పోతాడు. అందుచేత ఆంతరికంగా మన దృష్టి మరల్చుకోవడం మంచిది. అంతరంగంలో 'వారి'ని ఇంకా ఇంకా పొందడం ఉత్తమోత్తమమైనది.

మాటల్లో అందరూ జ్ఞానులే కాని చేతల్లో కాదు, అని తమాషాగా అనేవారు బాబూజీ.

**ప్రశ్న:** ఆలోచనలు రాకుండా మనస్సును ఎలా కట్టడి చేయాలి?

**సోదరి:** మనస్సును అంతరంగంలోనికి పూజ (ధ్యాన) విధానం ద్వారా తీసుకొని వెళ్ళవచ్చును. ఈ విషయమై బాబూజీ ఇలా అనేవారు. హృదయం, మనస్సు సన్నిహిత మిత్రులు. ఎంతగానంటే హృదయమనే ఆటస్థలంలో మనస్సు ఆడుకుంటుంది. కాని మనం వాటిని విరోధులుగా చేశాం.

మన హృదయానికి, మనస్సు మంచి మిత్రురాలని పదే పదే సూచనలిచ్చిన వాటి మధ్య విరోధ భావం తగ్గిపోతుంది. అవి మిత్రులైనప్పుడు ఆ సమస్య (ఆలోచనల సమస్య) తీరిపోతుంది.

**ప్రశ్న:** మనస్సును, హృదయాన్ని దగ్గరగా చేర్చిన తరువాత ఏమిటి?

**సోదరి:** ఇవి దగ్గరైన తరువాత (సోదర) స్నేహ భావం ఏర్పడుతుంది. కాని వీటి మిత్రత్వం నిలబెట్టడం చాలా కష్టం. ఎందుచేతనంటే స్నేహం త్యాగం కోరుతుంది.

బాబూజీ ఎంతో మంచివారని అనుకుంటాము. తరువాత ఒక కార్పెట్‌ను చూసి - ఇది చాలా మంచిగా బాగుంది అన్న ఆలోచన వస్తుంది. అప్పుడు హృదయానికి మిత్రురాలైన మనస్సు ఇలా అడుగుతుంది. "ఇంతకు ముందే ఒకరికి మనసిచ్చావు. మంచివారన్నావు. ఇప్పుడు ఈ కార్పెట్‌ను చూసి ఇదీ బాగున్నదని ఎలా అంటున్నావ్", అంటూ ఈ విధంగా మన మనస్సు, మన ఆలోచనలను సరి చేస్తుంది.

**ప్రశ్న:** వ్యక్తిగత సిటింగ్స్, సత్‌సంగ్‌లలో వారి స్థాయి (కండిషన్) ఎలా తెలుసుకోవడం?

**సోదరి:** మనం ధ్యానంలో ఉన్నప్పుడు - సహజంగా వాటి పని చూసుకునే జ్ఞానేంద్రియాలతో చూస్తే తేలికదనం ప్రశాంతతల

భావన అనుభవ మవుతుంది. ఇంకా ఆ స్థాయి తెలుసుకోవాలంటే ఆ స్థితిలో పూర్తిగా మునిగిపోవాలి. ప్రతిసారి మనం చేసే ధ్యానంలో బాబూజీ మనకు కృపాదానం చేస్తారు. ఈ కృపాదానములే వారు ఇచ్చే స్థితులు.

బాబూజీ ఒకసారి ఒక అభ్యాసిని సిటింగ్ తరువాత అతడిని, అతడి స్థాయిని పరిశీలించుకుని చెప్పమన్నారు. దానికి సమాధానంగా ఆ అభ్యాసి "అంతా బాగుంది" అన్నాడు.

"అది సరే! అంతా బాగున్నదన్నది నాకు తెలుసు. నీవు బాగున్నావు. నేను బాగున్నాను. ఈ గది బాగుంది. ఈ బాగుండడానికి కారణమైన విషయం ఏమిటి?" అని బాబూజీ అడిగారు.

కాబట్టి ప్రతిసారి మనం చేసే ధ్యానంలో బాబూజీ సాన్నిధ్య స్థితిని పొందుతాము. ఆ స్థితిలో మునిగిపోతాము. అప్పడు, ఈ తరువాత స్థాయిల అనుభూతి కూడా లభిస్తుంది.

**ప్రశ్న:** సెయింట్, ఋషిలకు గల తేడా ఏమిటి?

**సోదరి:** సెయింట్‌కు "శక్తులు" ఉన్నవి. అవి (మోడరేట్) సమభావ స్థితిలో ఉన్నాయి. సెయింట్‌కు తను పొందియున్న శక్తులను గురించి తెలియదు. దైవం నుండి ఆజ్ఞ రాగానే ఉజ్జీవం అవుతాయవి.

ఇందుకు బదులుగా ఋషి వద్ద ఏ శక్తులూ లేవు. క్రమత, అదుపు అన్నవీ ఉండకపోవచ్చు.

**ప్రశ్న:** ప్రార్థన ఎలా చేయాలి?

**సోదరి:** కేవలం మాటలతో ప్రార్థన చెప్పడం కాదు. హృదయాంత రాళంలో నుండి అదివ్యక్తం కావాలి. అస్వస్థతగా ఉన్న బిడ్డ గురించి

తల్లి హృదయంలో నుండి, దానికదే బయటికి దుమికేదే ప్రార్థన. బయటకు చెప్పేదంతా అంతరంగం నుండి గాఢమైన భావరూపంగా రావాలి-ఇదీ ప్రార్థన అంటే.

ప్రార్థన బాబూజీ మహరాజ్‌తో యోగం (కలయిక) కోసమే జరగాలి.

మన సంస్థ యొక్క ప్రార్థన పూర్తిగా దివ్యశక్తితో నింపబడింది. ఈ ప్రార్థన భావాన్ని అర్థం చేసుకుని అదే భావస్థితిలో ఉంటే అమోఘంగా ఉంటుంది. అర్థం గ్రహించకుండా ఆ భావస్థితిలోనూ లేకుండా ప్రార్థన వల్లించుకుంటే ఎంత వరకు అణకువగా ఉంటావో అంతే ఫలితాన్ని పొందుతావు. వినమ్రత, నివేదనలతో బాబూజీ ముందు అర్పించుకునే భావాన్ని పెంపొందించుకునేదే ప్రార్థన.

భౌతిక సమస్యల విషయాల గురించిన ప్రార్థనలో పరిష్కారం కోసం సర్వం వారికి నివేదించుకోవాలి. చేయదగిన విధంగా వారు చేస్తారు. అందుచేత ఆ సమస్యలపరిష్కారం గురించి మన ప్రార్థనలో వత్తిడి చేసే ప్రమేయం ఉండరాదు.

**ప్రశ్న:** సంస్కారాల నిర్మలీకరణ ఎలా?

**సోదరి:** సంస్కారాలు భోగింపబడాలి. అనుభవింపబడాలి.

సంస్కారాలు కూడా ఏదో ఒక విధంగా నిర్మలీకరిస్తే (పోగొడితే) ఈ భోగాలన్నీ (సదుపాయాలు, సుఖాలు) వాటంతటవే నశించిపోతాయి. అప్పుడు ఈ భోగాలన్నీ ఊహల్లోనే ఉంటాయి. మనం దైవంలో కరగిపోయినప్పుడు మాత్రమే సంస్కారాలు, మాలిన్యం కూడ కరిగిపోతాయి. బాబూజీ కృప, దయాగుణాల వల్లనే అవి అలా కరిగిపోతాయి.

లయావస్థకై 'వారి'తో అనుసంధించుకున్నప్పుడు ఆనంద ప్రశాంతతలు, ఆరోగ్యాదులు మాత్రమే మిగిలి ఉంటాయని అనుకోరాదు. భోగించవలసినది ఈ భూమి మీదనే, కర్మలు అనుభవించవలసినదీ ఈ భూమి మీదనే. కనుక ఈ భూమితో మనకు సంబంధం ఉన్నంతవరకు ఈ సంస్కారాలన్నీ మనం అనుభవించడానికై - అవి మనల్ని అంటిపెట్టుకునే ఉంటాయి.

మన సంస్కారాల్ని మనం తుడిచేసుకోవచ్చుగాని మన కుటుంబం లోని వారి సంస్కారాలను (భరించి) ఓర్చుకోవాల్సిందే. ఎలాగంటే - కుటుంబం లోని ఒక వ్యక్తి అనారోగ్య బాధకు స్పందించి మనం బాధపడతామే అలాగన్నమాట.

**ప్రశ్న:** యూనివర్సల్ ప్రేయర్ (విశ్వ వ్యాప్త ప్రార్థన) ఎలా చేయాలి?

**సోదరి:** అన్ని ప్రార్థనలు ఆయా పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. విశ్వప్రేమ నీలో లుప్తమైనంత (లేనంత) కాలం నీవా ప్రార్థన చేయలేవు, 'వారి'కి అది చేరదు.

విశ్వవ్యాపియైన వారొక్కరే విశ్వవ్యాప్త ప్రార్థన చేయగలరు.

ఇంకా చెప్పాలంటే విశ్వప్రేమలేని వాడు విశ్వవ్యాప్త ప్రార్థన ఎలా చేయగలడు (చేయలేడు).

ఈ సందర్భంలో బాబూజీ మహరాజ్ వివరణ వినండి. మానవాళి నంతటినీ ఆది తత్వానికి చేర్చేందుకే 'తాను' వచ్చాననీ, అందుకుగాను దైవానికి వినమ్రులై మానవులందరూ అనంత తత్వానికి చేరే కార్యాన్ని నెరవేర్చండి - అన్నారు.

ఇక్కడ ఉన్న చెత్త చెదారాన్ని ప్రోగు చేయాడానికి పై నుండి దిగి వచ్చిన బ్రహ్మాండమైన క్రేన్‌లా ఉంది ఇది. అలాగే మానవాళిని

ఆది తత్వానికి (తొలి స్థితికి) తిరిగి తీసుకొని వెళ్లడానికి అనంతం నుండి మార్గ దర్శకులుగా దిగివచ్చారు బాబూజీ.

**ప్రశ్న:** బాబూజీకి కృతజ్ఞతలు ఎలా చెప్పాలి?

**సోదరి:** సమున్నతులైన పెద్దలకు వట్టి మాటలతో కృతజ్ఞతలు అందించకూడదు. వినయంతో మనల్ని మనం అర్పించుకోవడం ద్వారానే కృతజ్ఞతలు చెప్పకోగలం. అనంతం నుండి బాబూజీ మహరాజ్ మన కోసం వచ్చినారు కాబట్టి మన ప్రాపంచిక కార్యాలన్నీ చూసుకుంటునే అనుక్షణం మనల్ని మనం (మన హృదయాన్ని) వారికి అర్పించుకుని కృతజ్ఞతాభావాన్ని చూపవచ్చు.

'వారి'కి ఎందుకు ఋణపడి ఉన్నామోనన్న జ్ఞానం లేని మనకు వినయంతో 'వారి'కి ఆత్మార్పణ చేసుకోవలసి ఉంది. కనుక అంత అర్పణ బుద్ధితో ఆత్మ నివేదన చేసుకోవడం ఒక్కటే 'వారి'కి కృతజ్ఞత చూపడం అవుతుంది.

**ప్రశ్న:** బాబూజీ మహరాజ్ హుక్కా గొట్టంలో ఏదైనా రహస్యం ఉందా?

**సోదరి:** బాబూజీ అక్కడ లేనప్పడు ఒకసారి ఆధ్యాత్మిక లాభం పొందాలని ఒక అభ్యాసిహుక్కా పీల్చడానికి ప్రయత్నించాడు. ఫలితంగా తీవ్రమైన దగ్గుతోను, హుక్కా గొట్టంలో నుంచి వచ్చిన నీరు గొంతుకు అడ్డంపడి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. బాబూజీ తమ గదినుండి బయటికి వచ్చి ఆ అభ్యాసీతో 'అదయ్యా! దాన్నుండి నీవు పొందింది-అంతేగా', అన్నారు హాస్యంగా.

"పెద్దల ముందు ఊరికే అలా తల వంచితే ఏమిరాదు, కాని తన్ను తాను అర్పించుకుంటే ఎంతో ఫలితం పొందుతాడు" అని బాబూజీ ఒకసారి అన్నారు.

**ప్రశ్న:** ట్రాన్స్‌మిషన్ జీర్ణించుకునే సామర్థ్యం ఎలా పెంచుకోవాలి?

**సోదరి:** మరో పొట్ట ఉంటే మరింతగా తినవచ్చు అన్నట్లు - అని నవ్వి - తపన వల్లనే ఆసామర్థ్యం పెంచుకొనవచ్చును. తపన, సామర్థ్యం కలసే పెంపొందుతాయి.

**ప్రశ్న:** శూన్యత (అభావం) అంటే ఏమిటి?

**సోదరి:** 'నేను' అన్నది లేకపోవడమే శూన్యత (అభావం). ఇందులో 'నాది' అన్నది ఉండదు. 'నేను' అన్నదాన్ని అర్పించుకుంటే - అదే శూన్యత (అభావం).

**ప్రశ్న:** ఇండివిడ్యుయల్ సిటింగ్, సత్సంగ్ ఇండివిడ్యుయల్ మెడిటేషన్‌లకు గల భేదంఏమిటి?

**సోదరి:** భేదం ఏమిలేదు - దాహార్తిగా ఉన్న మనిషి తన దాహాన్ని బట్టి నీటిని త్రాగుతాడు. ఎక్కువ దాహం వేస్తే ఎక్కువ నీటిని తీసుకుంటాడు. సత్సంగ్‌లో కాని, ఇండివిడ్యుయల్‌మెడిటేషన్‌లో గాని మీ వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టే దాన్ని మీరు స్వీకరించడం జరుగుతుంది. ఇండివిడ్యుయల్ సిటింగ్‌లో క్లీనింగ్ (నిర్మలీకరణ) ప్రతి ఒక్కరికి విడివిడిగా చేయబడుతుంది. అయితే దాహార్తి, జీర్ణంచుకునే సామర్థ్యము అతడికి గల తపనపై (గాఢమైన కోరికపై) ఆధారపడి ఉంది.

తపన, ఇష్టత, కోరిక, సామర్థ్యం - వీటిపై ఆధారపడి, ఇవి పెరిగిన కొలదీ ప్రాణాహుతిని జీర్ణించుకోగలగడం అన్నది (పెరుగుతూ) ఉంటుంది. ఇది ఏ సిటింగ్‌కైనా వర్తిస్తుంది.

ప్రిసెప్టర్ వద్ద సిటింగ్ తీసుకునేటప్పుడు అభ్యాసిని క్షాళన చేసి అతడు ఎక్కువగా జీర్ణించుకునే సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయత్నం ప్రిసెప్టర్ చేస్తారు.

ఈ సందర్భంలో సోదరి నవ్వుతూ ఇలా చెప్పారు. ఒక అభ్యాసి బాబూజీ మహరాజ్‌ను ఇండివిడ్యుయల్ సిటింగ్ ఒక్కటి ఇవ్వమని అడిగాడు. దానికి బాబూజీ సున్నితంగా స్పందిస్తూ "ఈ సంస్థలో నీవు చేరింది నీ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోవడానికి. కాని నీవు ఇండివిడ్యుయల్ సిటింగ్ ఇవ్వమని అడక్కుండా నిగ్రహించుకోలేక పోతున్నావు" అని అన్నారు. శాంతి అంటే అసంతృప్తి, అసంతోషం లేనిదే - శాంతి! అప్పుడే ప్రశాంతత ఉంటుంది.

బాబూజీ మహరాజ్‌ను తప్ప అన్యము కోరనివాడే అభ్యాసి.

సహజ మార్గన్ని గూర్చి విన్నప్పుడు దాన్ని అనుసరించడం కష్టమని అనిపిస్తుంది, అని అందరూ అనుకుంటారు. ఈ విషయమై సోదరి ఇలా గట్టిగా చెప్పారు - 'మనం ఆ మార్గంలో సాధన చేస్తే అది చాలా తేలిక మరియు సులభం అనిపిస్తుంది.'

దేనిని అయినా తేలికగా (సులభంగా) చేయాలంటే దానిలో మనం పూర్తిగా మునిగిపోవాలి.

సహజ మార్గ అభ్యాసం చాలా తేలిక, సులభం. కాని సహజ మార్గ నియమాలు చదివినప్పుడు అది కష్టమనిపిస్తుంది.

**ప్రశ్న:** సహజ మార్గంలో లేని వారెవరైనా ప్రకృతి కార్యములను నిర్వహిస్తున్నారా?

**సోదరి:** ఎవరూ చేయడంలేదు, చేయలేరు. ప్రకృతి ఆజ్ఞలను ఎవరూ అర్థం చేసుకోలేరు.కాబట్టి ఇతరులు అంటే సహజ మార్గంలో లేని వారు - ఆ పని చేయలేరు, చేయడం లేదు. సహజ మార్గంలో బాబూజీ ఆయా పద్ధతులు చెప్పి, త్రోవచూపి ప్రకృతి కార్య నిర్వహణ చేయిస్తారు.

**ప్రశ్న:** ఆధ్యాత్మికంలో పేరాశకు స్థానమున్నదా?

**సోదరి:** ఆధ్యాత్మికంలో పేరాశ బహు చెడ్డది.ప్రేమ, భక్తి వల్లనే ఆధ్యాత్మికతను పొందుతాము. పేరాశలో బంధనము ఉంటుంది.

ప్రాణాహుతిని పొందేందుకన్నా, ఉత్తమంగా మారేందుకన్నా కూడా ఎక్కువ మంది వద్ద ఎక్కువ సిటింగ్స్ తీసుకోవాలన్న తపన, ఆతృతయే పేరాశలో ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ సిటింగ్స్ తీసుకోవాలన్న తపన, ఆతృత - ఇది పేరాశయై బంధనంగా మారుతుంది.

ఇట్టి పేరాశకల, దురభిప్రాయం వలన అభివృద్ధి చెందక పోవడమే కాక ఎంత మంది దగ్గరనో సిటింగ్ తీసుకుంటున్నాను - అన్న అహం ఉద్దీపం అవుతుంది. ఇలా ఈ విధంగా మారిన వ్యక్తులలో ఆధ్యాత్మికత ఏమీ ఉండదు.

పేరాశ గల వానిలో ఆర్తి తీరుతుంది. తపన గల వానిలో ఈ ఆర్తి ఇంకా ఇంకా పెరిగిపోతుంది.

మాస్టర్ మీద నమ్మకం ఉంచి విధేయంగా, వినమ్రంగా ఉండి పూర్తి సహకారంతో ఉంటే ఆధ్యాత్మిక అవసరాలకు పూర్తి బాధ్యత వహిస్తారు ఆయన.

**ప్రశ్న:** అహం యొక్క దశలను వివరిస్తారా?

**సోదరి:** అహం యొక్క దశలలో వ్యక్తిత్వం నెమ్మదిగా కరగిపోతుంది. దైవానికి అనుసంధానమైనప్పడు అహం కరగనారంభించును. నిజం చెప్పాలంటే అహంకారంలో దశలు లేవు. ఎక్కడైతే ఆధ్యాత్మికతకు దశలు లేవో, అక్కడ 'అహం'నకు దశలు ఉంటాయి. ఎప్పడైతే 'నేను' అన్నది కరగుతున్న భావం కలుగుతుందో (ఏర్పడుతుందో) అప్పడు 'అహము' దశలు కరుగుతాయి.

సోదరి కస్తూరి గారి క్రొత్త పుస్తకంలో 'మై' నెస్ 'ఐ' నెస్ గురించి వివరించారు.

**'మై' నెస్:** ప్రాపంచిక విషయాలకు సంబంధించిన అహంకార భావ సూచన.

**'ఐ' నెస్:** ఇది దైవ స్థితిలో ఆత్మతత్వము యొక్క ఎరుకకు సంబంధించినది.

**నథింగ్ నెస్ :** శూన్యత (అభావం). బాబూజీ మహరాజ్‌లో 'ఐ'నెస్ కరగిపోయినప్పడుశూన్యతే ఉంటుంది. (మిగులుతుంది).

నథింగ్‌నెస్ నుండి ఈ 'నెస్'ను తొలగించినప్పడు బాబూజీ మహరాజ్ (అనంతత్వము) మాత్రమే మిగులుతారు.

ధ్యానంలో లోతుగా వెళ్ళినప్పడే నిజమైన ఆనందము కల్గుతుంది. ఆనందము అంటే ఏమిటి అనేది స్థితిలో మునిగినప్పుడు తెలుస్తుంది. బాబూజీ చెప్పేది ఏమంటే సహజ మార్గ సిస్టమ్ అంటే మరేదో కాదు. ఎలా జీవించాలో తెలిసికోవడమే.

### 1. తురీయ స్థితి పొందాలంటే సహజంగా వస్తుందా? లేక సాధన చేయాలా? దేనికొరకు?

**జవాబు.** నీవు ఇక్కడకు (లక్నోకి) వచ్చేటప్పుడు రైలు టిక్కెట్టు కొనుక్కొని రైల్లో కూర్చుంటే మధ్యలో వున్న అన్ని స్టేషన్లు నీ ప్రమేయం లేకుండా యాంత్రికం గానే వస్తుంటాయి. అన్ని స్టేషన్లు దాటి నీ గమ్యస్థానం చేరుతావు. అలాగే ఆధ్యాత్మికతలో సాక్షాత్కారం పొందాలంటే భక్తి అనే టిక్కెట్టు కొనుక్కోవాలి. భక్తి వుంటే సాక్షాత్కారం వస్తుంది. ఆధ్యాత్మికత పొందటం అనేది చాలా కష్టమైనది. భక్తి వుంటే పని చాలా సులభమైపోతుంది.

మనం మంచి చెడులను ఒకటిగా చూడటం అలవాటు చేసుకోవాలి. ఎవరైనా చెడుపనులు చేస్తున్నప్పడు - చెడుగా

అనిపిస్తే వారికి చెప్పవచ్చును. అంతే కాని వారు చెడు చేస్తున్నారని ద్వేషభావంతో చూడకూడదు. అలా చెడుభావనను మన మనసు వరకు రానివ్వకపోతే ఎదుటివారిలో కూడా పరివర్తన వచ్చి మంచి వైపుకు మరలుతారు.

అది చదువు ఇది చదువు అని చెప్తుంటారు. చదవటంవల్ల భక్తి పెరగదు.భక్తి వల్లే 'వారు' మనలో ప్రవేశిస్తారు. 'వారి' ప్రవేశం వల్లే మనలో పరివర్తన వచ్చి మనము ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతాము. 'వారు' మన హృదయం నందు ప్రవేశించి ఒక చిత్రకారుడు ఒక చిత్రమును తనకు నచ్చిన విధంగా ఎలా దిద్దుకుంటాడో బాబూజీ మనలను అలా మలచుకుంటారు. మనకు తెలియకుండానే మన ప్రవర్తనలో మార్పు వస్తుంది.

ఆశ్రమ భవనము నుంచి వెళ్ళగొట్టవచ్చుగాని బాబూజీ హృదయమనే ఆశ్రమము నుంచిఎవ్వరూ వెళ్ళ గొట్టలేరు. అందువలన ఆశ్రమం అనేది 'వారి' హృదయములోనే వుంది. ఆత్మ సాక్షాత్కారం అనగా-మనం ఏపని చేస్తున్నా ఎవ్వరితో మాట్లాడుతున్నా నేను మాట్లాడుతున్నాను, నేను చేస్తున్నాను అనుకుంటాము. అలా కాక ఆత్మ సాక్షాత్కారదశ చేరేటప్పటికి 'నేను' స్థానంలో 'బాబూజీ' యే (దైవమే) ఆ పనులు చేస్తున్నట్లు 'వారే' ఆస్థానంలో మాట్లాడుతున్నట్లు, అంతటా 'వారే' వున్నట్లు అనుభూతి కల్గుతుంది. ఆ స్థితే ఆత్మ సాక్షాత్కారం! ఆత్మ సమర్పణ వలన ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. 'మీరు ఎల్లప్పుడు నాతోనే ఉండాలి' అని ప్రార్థించాలి. వారు మనతోనే వున్నప్పుడు మన మనస్సు చెడువైపుకుమరలదు.

అలా ఎందుకు చేశాము? ఇలా ఎందుకు చేశాము. అలా చేయవలసింది కాదు ! అని పదేపదే బాధపడుతూ వుండటం వల్ల మన హృదయం ప్రభావితం అవుతుంది.అందువల్ల మనం మళ్ళీ అలాంటి పని చేయకుండా వుండాలని బాబూజీని ప్రార్థించుకొని ఇక ఆ విషయం వదలి వేయాలి. అలాంటప్పడు మన స్థితి వికలం అవకుండా వుండాలని ప్రార్థనచేసుకోవాలి.

బాబూజీ చెప్పేది ఏమంటే 'నీవు సహజమార్గ సిస్టమ్‌లో చేరావు!' సహజ సిద్ధంగా అంటే - ఒకటి - నీలో భగవంతుడు వున్నాడని నీవు అనుభూతి చెందినప్పడు, రెండవది మన ఈ విధానంలో సోదర భావం పెంపొందాలని, బాబూజీ ఆశీర్వాదం వలన మనలో సోదర భావం పెంపొందుతుంది బాబూజీ చెప్పారు-'నేను సోదర భావం అనే దానితోనే సహజమార్గ విధానానికి జీవం ఇచ్చాను.'

మనము సాధనను నిజమైన మార్గంలో చేస్తుంటే దశ నియమాలు మనకు తెలియకుండానేమన ఆచరణలోనికి వస్తాయి. ఈ దశ నియమాలలో గల స్థితులను నీవు అనుభూతి చెందుతావు. కేవలం ఆచరణవల్ల ఈ దశ నియమాలను పాటించటం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు. సాధనలో ఇవన్నీ నీ ఆచరణలోనికి రావడం నీవు చూస్తావు.

సిట్టింగ్ అంటే ఆ భగవంతుని నీలోనికి ఆహ్వానించి, ఆ భగవంతునితో కలసి కూర్చోవడమేనని అర్థం. కనుక ఆ ఈశ్వరుని తో కలసి కూర్చోవాలి. అప్పడే నీకు ఆ దివ్యత్వము లభిస్తుంది.

నీవు నిజమైన అభ్యాసిగా జీవించు. నీ దృష్టి అంతా ఆ దివ్యత్వము మీదే ఎల్లప్పడూ వుంచాలి. అప్పడే నీవు నిజమైన సహజమార్గ

అభ్యాసివని అనిపించుకుంటావు. బాబూజీ యొక్క ఆశీర్వచనములు ఇప్పుడు ఇక్కడ ఒక వర్షం వలే కురుస్తున్నది. 'వారు' మనకుమన ఆధ్యాత్మిక పురోగతికి కావలసినదంతా ఇచ్చారు. మనం చాలా శ్రద్ధగా వుండాలి. మనం దేనిని గురించి ఎటు వెళ్లినా మన హృదయాన్ని మాత్రం సహజమార్గం వైపు త్రిప్పకోవాలి. ఇదే నిజమైన అభ్యాసి చేయవలసిన పని!

ఆధ్యాత్మికత అనేది స్వాగతవచనాలతో వచ్చేది కాదు - ఆధ్యాత్మికత - ఆ భగవంతుని కలవాలని మనం పడే బాధ, తపన వల్ల మాత్రమే వస్తుంది అన్నారు.

ఆధ్యాత్మిక ఉత్సవంలో అభ్యాసులందరూ ఒక చోట చేరి, ధ్యానము చేయుటచే నేను అనంతము నుండి శక్తిని ప్రసారం చేస్తాను. అందువలన ఉత్సవం జరిగే ఆ మూడు రోజులు అభ్యాసులందరూ ఆధ్యాత్మిక ఆవరణచే కప్పబడి వుండటం, ఆ తరువాతి రోజుల్లో అది లేక పోవటం నీవు చూశావు.' అని బాబూజీ చెప్పారు.

వసంత పంచమి ఉత్సవంలోను, ఏప్రియల్ 30 - బాబూజీ జన్మదిన ఉత్సవాలలోను అభ్యాసీలు తమను తాము మరచిపోయేవారు. 'నేను' అనే భావన అభ్యాసీలలో దానంతటదే మాయమై పోవుటను నేను చాలా సార్లు గమనించాను. ఒకసారి ఒక అభ్యాసి 'బాబూజీ! మేము షాజహాన్‌పూర్‌కు మీ వద్దకు వచ్చినప్పడు ఇక్కడ మాకు చాలా ఆనందంగా, ప్రశాంతంగా వుంటుంది. ఇటువంటి స్థితి మాకు ఇంటి వద్ద ఎందుకు కలగటం లేదు?' అని అడిగారు. అప్పడు బాబూజీ - "ఇక్కడ 'నేను', 'నీవు'వేరే వేరే అనే భావన నీలో లేదు. మీ ఊరిలో - ఇది నా ఇల్లు - అక్కడ

షాజహాన్‌పూర్‌లో అది బాబూజీ ఇల్లు అని భావించుకొని నేను వేరు నీవు వేరు అనే బేధ భావనలో వున్నావు. అందువలన నీకు అక్కడ మీ ఊరిలో ఈ ఆనందం, శాంతి కలగటం లేదు" అని అన్నారు.ధ్యానం చేయటం వలన వారియొక్క సామీప్యత ఏర్పడి మీకు దానంతట అదే పూర్తి ఫలితం లభిస్తుంది. సత్సంగ్ అంటే సత్+సంగ్ అనగా మనము దైవము యొక్క చరణాలను పట్టుకున్నామని అర్థం. అనగా మనసు ఎల్ల వేళలా 'వారి' శరణులోనే వున్నాను. 'వారు' ఎల్లవేళలా మనతోనే ఉన్నారు అని అర్థం. సామీప్యతా ఫీలింగ్ ఎంత ఎక్కువైతే అంతగా మీలో ప్రేమ, భక్తి, వైరాగ్యము మరియు 'వారి'తో కనెక్షన్ అనేది అంతగా ఏర్పడుతుంది. ఇక్కడ మీరు ఏ విధంగానైతే సత్సంగ్‌లో వున్నారో, మీ ఇంటి వద్ద అదే విధంగా, బాబూజీలోనూ ఉండి, వారి (నియర్‌నెస్) సాన్నిధ్యతలో మునిగిపోయి వుండటానికి ప్రయత్నించాలి.

చంటి పిల్లలు ఊహించలేరు. పెద్దలము మనము ఏదైనా వూహించి మాట్లాడుతాము. ఈ ఊహ అనేది - మన లోపల దైవం (బాబూజీ) వున్నాడనుకుంటూంటే, 'వారి'లా ఉన్నతంగా ప్రవర్తిస్తూంటే 'వారి'తో మనకు సంబంధం ఏర్పడుతుంది. మన భావనలో అలా 'వారి'నే ఊహించుకుంటూ 'వారి' కొరకే 'తపన' చెందుతూ వుంటే మన శరీరం అక్కడ వుంటుంది కాని మనముండము. నోరు మెదుపుతూ వుంటాము కాని హృదయం వారి కొరకే తపిస్తూ వుంటుంది. ఇది అన్నింటినీ మించిన మంచి పద్ధతి! అధ్యాత్మికత అనేది అసలు ఈ తపనలోనే వుంది. ఈ

విధంగా దైవాన్ని నీవు చూడక పోయినప్పటికీ దైవాన్ని ఊహించుకోవటం ద్వారా ( కల్పనలో వున్నాడను కోవడం ద్వారా) 'వారి' ని పొందడానికి తపన వృద్ధి చెందుతుంది. ఆ తపనతో దైవాన్ని దర్శించగల్గుతాం! ఆనందం కల్గుతుంది.

ప్రాపంచికంగా ప్రయాణించటమంటే మనకు ధనము, వాహనము టికెట్లూ అవసరమవుతాయి. కాని ఆధ్యాత్మిక ప్రయాణానికి ఇవేమీ అవసరం లేదు. నమ్మకం కావాలి. 'మీరు లేకుండా నేను జీవించలేను బాబూజీ' అని వారి వద్ద నుంచి అభ్యాసి తిరుగు ప్రయాణమవుతుంటే "స్మరణ వెంట తీసుకు వెళ్ళు, నిన్ను మాత్రం నా వద్ద వదలి వెళ్ళు" అన్నారు బాబూజీ. కనుక భౌతిక రూపం కాకుండా స్మరణపైన ధ్యాస వుండాలి. 'బాబూజీ నేను మీవాడిని అన్నింటికి బాధ్యత మీదే' అన్నట్లుగా అర్పించుకోవాలి.

మీరా, కబీరుదాసు, సూరదాసు లాంటి వారు వారియొక్క స్వయం కృషితో ఎంతో కష్టపడి వారున్నస్థితికి చేరుకున్నారు. అలా కాక, బాబూజీ తమ సంకల్పంతోనే మనకు అన్నీ ఇస్తున్నారు. అందువలన మనమెంతో అదృష్టవంతులము.

దగ్గర బంధువులతో ఎవరితోనైనా సరియైన సంబంధాలు లేక పోయినప్పటికీ వాటిని తరువాత సరి చేసుకోవచ్చు, అంతే కాని ఫంక్షన్లకు ఆహ్వానించడం మానేయకూడదు. మనం ఎల్లప్పుడు సతత స్మరణతో ఉండి ఎవరితోను చెడుగా మాట్లాడకూడదు. చెడుగా ప్రవర్తించకూడదు. ఒక వేళ ఏదైనా బాధాకరంగా మాట్లాడవలసి వచ్చినా ఎదుటి వారి హృదయానికి గుచ్చుకొనేలా మాట్లాడకూడదు. బాబూజీని మన హృదయంలో నింపుకోవడం ద్వారా మనం మన ఆవేశ ఉద్రేకాలను కంట్రోలు చేసుకోవచ్చును.

బ్రహ్మవిద్య ఒకరు నేర్పించేది కాదు. ఒకరి హృదయం నుంచి ఇంకొకరి హృదయానికి వ్యాపించేది అది.

ఏ విషయమైనా అవతలి వారి హృదయం బాధపడేలా పదేపదే చెప్పకూడదు. ఒకసారి చెప్పి వదిలి వేయాలి. మనకి ఎప్పుడైనా కోపం వచ్చినప్పటికి బాబూజీ యొక్క నిరంతరస్మరణలో ఉండటం వలన ఆ కోప తీవ్రత తగ్గుతుంది. ఎదుటి వారిలో ఏదైనా విషయం మనకు చెడుగా అనిపించినప్పటికి ఆ విషయం పదే పదే వారితో అనకూడదు. అలా అనడం వలన ఆ విషయం మన హృదయాన్ని లోతుగా తాకుతుంది. ఒకసారి చెప్పి వదిలివేయాలి.

**దర్శన్ -** ఇది సాక్షాత్కారానికి మొదటి స్థితి. ఈ స్థితిలో 'వారు' నాముందే ఉన్నారు - ఒక దివ్యాభరణము భూమా నుంచి దిగివచ్చినట్లు. కాని నా హృదయంలో ఎలా అనిపిస్తుందంటే సార్వభౌమాధికారి దిగివచ్చి హృదయంలో ఉండి మీకు శాంతిని, బ్రహ్మానందమును ప్రసాదిస్తున్నట్లు. ఇదే రియలైజేషన్ యొక్క స్థితి. నిన్ను నీవు మరిచిపోయే స్థితికి వచ్చావంటే, నీవు రియలైజేషన్ యొక్క రెండోదశకు వచ్చినట్లు. నీ హృదయంలో 'వారి'యొక్క ప్రవేశాన్ని స్వాగతించుట ద్వారా ఈ స్థితి ప్రాప్తిస్తుంది. ఇది అందరికి చెందినది.

# శ్రీ రామచంద్రమిషన్‌లోని సదాచార సంబంధ నియమాలు

1. మన జీవితమును జల పక్షివలె మలుచు కొనవలెను. అది నీటి నుండి బయటకు వచ్చినను దాని రెక్కలు పొడిగానే ఉండును.
2. సత్సంగ సోదరుల యడల ప్రేమ కలిగి దైనందిన జీవితములో మాటల తీరులో మాధుర్యము ఉండవలెను.
3. మిత్రుని, శత్రుని ఒకే విధముగా భావిస్తూ ఇరువురి యొక్క మేలును కోరవలెను.
4. పతివ్రతవలె హృదయములోనాధుని స్మరణకే స్థానము నిమ్ము. అన్యుల గూర్చిన ఆలోచనలు రానీయకుము.
5. వ్యర్థ ప్రసంగములు చేయరాదు. నవలలు చదువుట మానివేయ వలెను. హృదయములో అన్యులపై ప్రేమను పెంచుకొనరాదు. స్నేహితుల యడల వ్యర్థమైన వ్యామోహమును విడిచి పెట్టుము. కేవలం ఈశ్వరుని మాత్రమే మిత్రునిగా భావించుము. ఈశ్వరీయ ప్రేమను వెదజల్లే గ్రంథములను చదువవచ్చును. ప్రత్యక్షముగా ఈశ్వరుని నుండి గాని నా ( బాబూజీ) నుండిగాని అనుజ్ఞ పొందునంత వరకు మూఢ వేదాంత పఠనము చేయనవసరము లేదు.
6. ఒండొరుల మధ్య సోదర భావము కలిగి ఉండవలెను. ఒకరి కష్టములలో ఒకరు సహకరించుకొనవలెను.
7. ఈ మార్గమునకు శ్రేష్ఠమైన ఆచరణ ఆధారము. బ్యాహ్యక్రియలు అనగా సంధ్యోపాసన, ఉచిత రీతిని గృహకృత్యములు నిర్వహించుట, ఇవి ముఖ్యముగా మానవుని కర్తవ్యము.
8. మనస్సులో కళంకము ఏర్పడని విధముగా పిల్లల పోషణ, పెంకము నిర్వర్తించవలెను. అనగా వారి పట్ల ప్రేమ కష్టదాయకము కారాదు.
9. గృహస్థ జీవిత రథమునకు పురుషుడు ఒక చక్రముగాను, స్త్రీ మరియొక చక్రముగాను భావించి, స్త్రీని తనకు సహకారిణిగా రూపొందించు కొనవలెను.
10. ఇరుగు పొరుగు వారిని తన వారుగా భావించి వారునూ కూడా తన పట్ల అట్లే భావించునట్లు చూడవలెను. అందరి విషయములోను ఈ సదాచారము పాటించవలెను.

11. బంధువులతో సంబంధము తెగిన త్రాడువలె కనబడు నట్లుండవలెను. వారి కష్టములలో సహకరించవలెను. అందరి విషయములోను ఇదే విధముగా ప్రవర్తించవలెను. డబ్బు ఇచ్చి పుచ్చుకొనుటలో జాగరూకతతో ఉండవలెను. అవసరమైనప్పుడు వారికి సహాయము చేస్తూ ఒక వేళ అది వారి నుండి తిరిగి రాకపోయిననూ విచారపడక సంబంధము చెడకూడదన్న భావముతో ప్రవర్తించవలెను.
12. తనపై అధికారుల సంబంధములో తాను కర్తవ్య నిర్వహణలో దిగజారినట్లు వారు భావించకుండా వుండు విధముగా వ్యవహరించ వలెను. తాను చేయు సేవకు ముట్టే ప్రతిఫలము ఈశ్వరపరముగా ఎంచవలెను.
13. తన మాటకు విలువ ఉండదని గ్రహించిన చోట, విశ్వాసములేని తావులలోను తన సలహా ఇవ్వరాదు. రోగి ప్రమాదస్థితిలో ఉన్నాడని భావించినప్పుడే (వైద్యుడు కానివాడు) మందును సూచించవచ్చును. చేయి జారిపోవుచున్నదని అనుమానము కలుగనంతవరకూ సూచించరాదు.
14. తన మనస్సులో భేద భావమును ఇతరులకు తెలియ చేయవలసిన పని లేదు. అట్టి భేదభావమును దాచి ఉంచినట్లు భావించే విధముగా ప్రవర్తించవలసిన పని కూడా లేదు. జీవితము సామాన్యముగా తటస్థ (మిత) భావముతో గడపదగినది. సాధ్యమైనంత వరకు చింతను చెంతకు చేరనీయరాదు. ఒక వేళ కలిగినను ఈశ్వర వరముగ ధన్యవాదము లర్పించవలెను. ఇదే అభ్యాసము ఇతర గృహసంబంధమైన విషయములలో కూడా పాటించవచ్చును.
15. అన్న పానములలో జిహ్వా చాపల్యము ఉండరాదు. ఆర్జన పవిత్రమై ఉండునట్లు దృష్టి వుంచవలెను.
16. తన సర్వస్వము గురువునకు అర్పణ చేయవలెను (అనగా ధనము మొదలైనవి కాదు) ఆయనను తన సర్వస్వముగా భావించవలెను. వ్యవహార విషయములలో మానవతా నియమములను పాటించవలెను.
17. సత్సంగీ సోదరులతో సంబంధము ఆనందదాయకముగను వారికి అభ్యున్నతి కరముగాను వుండవలెను.

## ప్రార్ధన అంటే...

మన అంతర్గత అవసరాన్ని నెరవేర్చమని ఎవరిని సంబోధిస్తున్నామో కూడా తెలీకుండా చేసే ఆర్తనాదమే ప్రార్ధన!

ఒక పసిపాప ఆకలివేసినప్పుడు పాప ఏడుస్తుంది. అప్పుడు పాలివ్వడానికి పాప తల్లి పరుగున వస్తుంది. కానీ, తనకు ఆకలి వేస్తోందన్న సంగతి ఆ పసిపాపకు తెలుసా? ఎంత మాత్రమూ తెలియదు!

తనకు తెలియని అవసరం నెరవేరడం కోసం - ఆ పసిపిల్ల అంతరంగం నుండి ప్రకృతి చేసే ఆర్తనాదం అది!

ఆ విధంగా ఆ పసిపాప అస్పష్టంగా వెల్లడించిన అవసరాన్ని తీర్చేందుకు, ప్రకృతి తల్లి రూపంలో వెలుపలి నుండి ప్రతి స్పందిస్తుంది.

కనుక ఆత్మకు కూడా ఎరుకలేని అవసరాన్ని నెరవేర్చడానికి అంతరంగంలోకల ప్రకృతి బాహ్యంగా ఉన్న ప్రకృతికి ఇచ్చే పిలుపే ప్రార్థన!

ముక్తి సాధనలో ముందుకు సాగిపోవాలంటే
సహజమార్గం అందుకు సాటిలేనిది.
ఈ మార్గంలో బాబూజీ ముందుగానే ముళ్ళను
ఏరివేసి బాటను మృదువుగా చేసారు.
సహజమార్గం మనం ఎంపిక చేసుకున్న
మనోహరమైన పుష్పం వంటిది. పూవు నుంచి
సువాసన ఎలా వెదజల్ల బడుతుందో సహజమార్గం
నుంచి దివ్యశక్తి అలా ప్రవహిస్తూ ఉంటుంది.
సహజమార్గంలో ముళ్ళు తొలగించబడిన మనోహరమైన
గులాబీ పుష్పాలు మాత్రమే ఉన్నాయి. అభ్యాసి దీనిని
స్వీకరించటంలో ఏ ఇబ్బందీ కలగదు. ఈ విధానం
అన్ని మంచి వాటితోనే నిండి ఉంది. బాబూజీ ఆశీస్సులతో
మీరు అంతిమానికి చేరవచ్చు. అభ్యాసికి సాధనా
మార్గంలో ఎదురయ్యే ఆటంకాలన్నీ తొలగించబడతాయి.